ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
గురువారం 5 సెప్టెంబరు 2024


● అరవింద వారధిపై చేరిన చెత్తను ఎత్తిపోస్తున్న ఎక్స్‌కవేటర్

నష్టం.. కష్టం

వర్షాలు, వరదలతో బీభత్సం

నీటిలో నానుతున్న పంట పొలాలు

దిక్కుతోచని స్థితిలో రైతులు కన్నీటి పర్యంతం
లంక గ్రామాల్లో సర్వం కోల్పోయిన కుటుంబాలు
వరద ఉధృతికి కొట్టుకుపోయిన రోడ్లు, ట్రక్కులు, గోడలు


రేపల్లె : పల్లెపాలెంలో బురదమయమైన ఇంట్లో వస్తువులను శుభ్రం చేసుకుంటున్న మహిళలు

వరుణుడు విరామం తీసుకున్నాడు. కృష్ణమ్మ కరుణించింది. వర్షాలు, వరదల బీభత్సం బుధవారం నుంచి బయటపడుతుంది. కృష్ణా నదీ పరివాహక ప్రాంతం గ్రామాలు, లంకల్లో ఎవరిని కదిపినా కన్నీటి సంద్రమే. పంటలు కోల్పోయి కొందరు.. వ్యవసాయసామగ్రి గల్లంతై మరికొందరు.. మూగజీవాలు కనిపించక పలువురు.. ఇళ్లకు నష్టం వాటిల్లి కొందరు.. ఇలా ఎక్కడ చూసినా వరద బీభత్స బాధితులు కనిపిస్తున్నారు. ఎటు చూసినా నీరు.. కళ్లల్లో కన్నీటి వరద.. సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన స్థితి పలువురిది. కృష్ణమ్మ మహోగ్రంతో గొడ్డు, గోద, పొలం, పుట్ర ఏదీ అక్కరకు రాకుండా పోయిందని లంకలు, పరివాహక గ్రామాల్లోని ప్రజలు కన్నీటి పర్యంత మవుతున్నారు. వరద తగ్గుముఖం పట్టడంతో పంటలకు, ఆస్తులకు ఏరీతిలో.. ఎంతమేర నష్టం వాటిల్లిందో బాధితులు చూసుకుంటున్నారు. ఇక ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా అధికారులు నష్టం అంచనాల్లో నిమగ్నమయ్యారు. పంటల నష్టం లెక్కించేందుకు వ్యవసాయ, ఉద్యానశాఖలు ప్రత్యేక బృందాలను నియమించాయి. ప్రాథమిక అంచనాల్లోనే వేల ఎకరాలు ఉండటంతో వర్షాలు, వరద బీభత్స నష్టం అపారమని తెలుస్తోంది.

తెనాలి, బాపట్ల(ఆంధ్రజ్యోతి), కొల్లూరు, కొల్లిపర, సెప్టెంబరు 4: కృష్ణమ్మ ప్రకోపానికి నదీపరివాహక గ్రామాలు, లంకలు విలవిలలాడిపోయాయి. ప్రకాశం బ్యారేజి నుంచి రికార్డు స్థాయిలో నీటి ప్రవాహంతో వర్షం వరదగా మారి పొలాలను కబళించింది. కొల్లూరు, భట్టిప్రోలు, చుండూరు మండలాల పరిధిలో ఉద్యాన పంటలతో పాటు వరి కూడా పూర్తిగా నీట మునిగింది. బ్యారేజీకి ఎగువున భారీ వర్షాలు, కృష్ణానదికి వరదతో పల్నాడు ప్రాంతంలో కూడా చాలావరకు పంటలకు అపార నష్టం వాటిల్లింది. మూడు రోజులుగా నీటిలోనే పంటలు నానిపోయాయి. పత్తి, కంది తదితర పంటలకు తీవ్రంగా నష్టం జరిగినట్లు రైతులు తెలిపారు. పంటలతో పాటు పలువురు ఆస్తులు కూడా నష్టపోయారు. లంక గ్రామాల్లో గృహాలు, ప్రభుత్వ ఆస్తులు దెబ్బతినగా వాణిజ్య పంటలు కూడ తుడిచి పెట్టుకుపోయాయి. కృష్ణమ్మ వరద ఉధృతికి రేకుల షెడ్లు, పూరిళ్లు కూలిపోగా ప్రహరీలు పడిపోయాయి. ట్రాక్టర్ ట్రక్కులు తిరగబడి దెబ్బతినిపోయాయి. నిల్వ చేసిన ధాన్యం, ఇతర పంట దిగుబడులు చాలాప్రాంతాల్లో తడిసిపోయాయి. లంక గ్రామాల్లో ఉన్న ప్రజా పంపిణీ దుకాణాల్లో ప్రభుత్వం సరఫరా చేసిన రేషన్ బియ్యం కూడా తడిసి పోయింది. కృష్ణమ్మ లంక గ్రామాల ప్రజల జీవితాలను తలకిందులు చేసేసింది. వరదకు ముందు పండించి ఇంటికితెచ్చి దాచుకున్న పంటనూ వదలకుండా ముంచేసింది. నిన్నటి వరకు ప్రాణాలు దక్కితే చాలన్న ఆలోచనతో ఉన్నవారికి చివరకు ఆ ప్రాణం, వంటిపై దుస్తులే మిగిలాయి. మునిగిన ఇళ్లన్నీ బురదమయమై దుర్గంధం వెదచల్లుతుంటే, వాటిలో తలదాచుకోవడానికీ నానా తంటాలు పడాల్సిన దారుణ పరిస్థితి పలు ప్రాంతాల్లో నెలకొంది. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సాయం తాత్కాలికంగా కడుపు నింపుతుండటంతో కాస్తంత సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఎవరిని కదిపినా తీర్చలేని బాధలు, పూడ్చలేని నష్టాలే. కృష్ణా నదీ పరివాహక గ్రామాల్లో వరద తగ్గుముఖం పట్టాక బుధవారం ఇళ్లన్నీ నీటి నుంచి బయటపడ్డాయి. చాలావరకు రహదారులూ కోతపడిపోయి, గండ్లతో నడవడానికి కూడా వీలులేని విధంగా మారి కనిపించాయి. నాలుగు రోజులుగా వరద నీటిలో లంక గ్రామాలన్నీ మునిగిపోయిన సంగతి తెలిసిందే. మూడు రోజుల పాటు ఇళ్లలో తలదాచుకోలేక, డాబాలపైకి ఎక్కినా, కరెంట్ లేక చీకటిలోనే దోమలతో నరకాన్ని అనుభవించామని బాధితులు వాపోయారు. కొల్లూరు మండలం జువ్వలపాలెం, మునగలపల్లిలంక, భట్టిప్రోలు మండలం చింతమోటు, పెసర్లంక, పెదలంక, కృష్ణనగర్, పల్లెపాలెం వంటి గ్రామాలు ఇంకా కొంతమేర వరదలోనే ఉన్నాయి. కొల్లూరు నుంచి లంక గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా కోతపడిపోయి గండ్లమయంగా మారింది. ముఖ్యమంత్రి పర్యటన సమాచారంతో బుధవారం అధికారులు రోడ్లను సరిచేసే పనులు మొదలుపెట్టారు. నది మధ్యలో ఉన్న లంకలకు ఏకైక మార్గమైన అరవింద వారధిపై చెత్త, ముళ్లకంపలు పేరుకుపోయాయి. వరదకు కొట్టుకు వచ్చిన చెత్తా చెదారాలతో పాటు మూగజీవాల కళేబరాలతో అరవింద వారధి నిండిపోయింది. దోనేపూడి నుంచి పోతార్లంక వెళ్లే దారుల పరిస్థితీ దారుణంగా ఉంది. అరటి, కంద, పసుపు, కూరగాయలు, తమలపాకు, బొప్పాయి తదితర పంటలన్నీ పనికిరాకుండా పోయాయి. అరటి తదితర పంటలు దిగుబడి తీసుకునే తరుణంలో వరద కోలుకోలేని దెబ్బతీసిందని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. కొల్లూరు, భట్టిప్రోలు, కొల్లిపర, రేపల్లె మండలాల పరిధిలో 5,200 ఇళ్ల వరకు వరద నీటిలో మునిగిపోయాయి. వీటిలో 3,900 ఇళ్ల వరకు బయటపడితే, భట్టిప్రోలు మండలంలో మిగిలిన ఇళ్లు ఇంకా నీటిలోనే ఉన్నాయి. బయటపడిన ఇళ్లలో సర్వం తడిచి, పనికిరాకుండాపోతే, వారికి బంక మట్టే మిగిలింది. గృహోపకరణాలు, విద్యుత్తు పరికరాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు తడిచి పనికిరాకుండా పోయాయి. మూడు రోజులుగా చీకట్లో ప్రజలు అల్లాడిపోయారు. బుధవారం వరద తగ్గగానే పనులు మొదలుపెట్టి 25 గ్రామాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ప్రాథమిక అంచనా ప్రకారం విద్యుత్ శాఖకు రూ.80 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు సమాచారం.


మోర్తోట ముక్తేశ్వరస్వామి దేవాలయంలో అడుగుమేర తగ్గిన వరద


భట్టిప్రోలు మండలం వెల్లటూరు లంకల్లో వరద ముంపులోనే పసుపు పైరు


వరద ఉధృతికి దెబ్బతిన్న బొప్పాయి తోట

తగ్గిన ఉధృతి..

నాగార్జునసాగర్ జలాశయం నుంచి నీటి విడుదల ఆగింది. ప్రకాశం బ్యారేజీ నుంచి నీటి విడుదల 4 లక్షలు క్యూసెక్కులకు పరిమితం చేశారు. దీంతో నదిలో వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. మంగళవారం వరకు కృష్ణానది కరకట్టకు అనుకుని ప్రవహించిన నీరు ప్రస్తుతం నదిలో మాత్రమే ప్రవహిస్తుంది. ఎనిమిది అడుగుల మేర వరద ఉధృతి తగ్గింది. నదీ పరివాహక ప్రాంతంలో లంకగ్రామాలకు వెళ్లే రోడ్లు బయటపడ్డాయి. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చూస్తే చాలా వరకు వరద తగ్గుముఖం పట్టడంతో పంటలు నీటిలో నుంచి బయటపడుతున్నాయి. కొన్ని చోట్ల పల్లపు ప్రాంతాల్లో మాత్రం పంటలు నీటిలో నానుతున్నాయి.

నేడు లంక గ్రామాలకు చంద్రబాబు

● కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో సీఎం పర్యటన

వేమూరు: కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని వరద ప్రభావిత లంక గ్రామాల్లో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన బుధవారం ఖరారైంది. దీంతో అధికారులు హుటాహుటిన ఏర్పాట్లు చేస్తున్నారు. వేమూరు మార్కెట్ యార్డు వద్ద నిర్మించిన హెలిప్యాడ్‌కు ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా చేరుకుని అక్కడి నుంచి రోడ్డు మార్గాన కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని గ్రామాల్లో చంద్రబాబు పర్యటించనున్నారు. బాధితులను పరామర్శించి దెబ్బతిన్న పంటలను పరిశీలించనున్నారు. అవసరమైతే ముఖ్యమంత్రి బస కోసం వేమూరులోని బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు గృహాన్ని, ఆర్యవైశ్య కల్యాణ మండపాన్ని కలెక్టర్ వెంకటమురళి పరిశీలించారు. చంద్రబాబు రెండు రోజులు వేమూరులో ఉండేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రేపల్లె ప్రాంతంలో కూడా పర్యటించే ఆలోచనలో సీఎం ఉన్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తదితరులు పరిశీలించారు.


రేపల్లె : బొబ్బర్లంక గ్రామంలో పునరావాస కేంద్రంలో ఉన్న ప్రజల సమస్యలను వింటున్న మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్

అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం

మంత్రులు అనగాని, గొట్టిపాటి

అధిక వర్షాలు, వరదలకు నష్టపోయిన వారిని అన్ని విధాలా ఆదుకుంటామని మంత్రులు సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. కరకట్ట వెంబడి ఉన్న గ్రామాల్లో మంత్రులు బుధవారం పర్యటించి బాధితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పు లే ఇప్పుడు ప్రజలకు శాపంలా మారాయన్నారు. గృహాలు కోల్పోయిన వారికి స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. ఆర్థికంగా ఆదుకునే దిశగా ముందుకు వెళ్తామన్నారు. ప్రభుత్వం ప్రజలకు అండగా నిలిచి ఆర్థికంగా ఆదుకుంటుందని తెలిపారు.


ఓలేరు పల్లెపాలెంలో సామగ్రిని శుభ్రం చేస్తున్న తల్లి, కుమారుడు


పెనుమూడి: పల్లెపాలెంలో వరద ఉధృతికి కూలిన ఇంటి గోడలు


పల్లెపాలెంలో ఇంట్లో నీటిని బయటకు ఎత్తిపోస్తూ...


భట్టిప్రోలు : వెల్లటూరు నుంచి లంక గ్రామాలకు వెళుతున్న ప్రజలు


భట్టిప్రోలు : ఇంట్లో నీరును బయటకు ఎత్తిపోస్తూ..


ఆవులవారిపాలెంలో వరదకు తడిసిపోయిన ధాన్యం




కొట్టుకుపోయిన కొల్లూరు - ఆవులవారిపాలెం రహదారి


వరద ఉధృతికి బోల్తా పడి దెబ్బతిన్న ట్రక్కులు


అరవింద వారధిపై పనులను చర్చిస్తున్న ప్రత్యేక అధికారి, కలెక్టర్, ఎమ్మెల్యే ఆనందబాబు

బాపట్ల జిల్లాలో..

42,000 హెక్టార్లలో మునిగిన వరి

బాపట్ల(ఆంధ్రజ్యోతి): బ్యారేజీ నుంచి రికార్డు స్థాయిలో వచ్చిన వరద పొలాలను కబళించింది. కొల్లూరు, భట్టిప్రోలు, చుండూరు మండలాల పరిధిలో ఒక్క ఎకరం కూడా చేతికొచ్చే పరిస్థితి లేదు. వరిలో ఎకరాకు ఇప్పటికే పెట్టుబడి దాదాపు పదివేల వరకు పెట్టిన పెట్టుబడి మొత్తం నష్టపోయినట్లేనని రైతులు తెలిపారు. 45,000 హెక్టార్లలో పైర్లు నీటమునగగా ఇందులో వరి వాటానే 42,000 హెక్టార్లుగా ఉంది. మిగిలిన 3,000 హెక్టార్లలో మినుము, శనగ ఉంది. పంట నష్టపోయిన మండలాల్లో బాపట్లలో అత్యధికంగా 5,850, అమర్తలూరు 4,150, చుండూరు 5,000 చెరుకుపల్లి 4,200, వేమూరు 3,800 హెక్టార్లుగా అంచనా వేశారు. కర్లపాలెంలో 2520, భట్టిప్రోలులో 1,800 రేపల్లెలో 3,000 హెక్టార్లుగా అధికారులు ప్రాథమిక నివేదికలో పొందుపర్చారు. లంక గ్రామాల్లో ఉద్యాన పంటలు 4,614 హెక్టార్లలో నష్టపోయినట్లు సమాచా రం. వరి, ఉద్యాన పంటల నష్టంతో జిల్లాలో 48,000 మంది రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. వరద పూర్తిగా తగ్గాక ఈ నష్టం అంచనాలు మ రింత పెరిగే అవకాశం ఉందని అన్నదాతలు అభిప్రాయ పడుతున్నారు.


ఇంకా వరదముంపులోనే పెనుమూడి పల్లెపాలెం

గుంటూరు జిల్లాలో..

33,345 హెక్టార్లలో పంట నష్టం

జిల్లాలో ఏడుగురు జల సమాధి

గుంటూరు(ఆంధ్రజ్యోతి): వర్షాలు, వరదల కారణంగా జిల్లాలో 75,153 మంది ప్రజలు ఇబ్బందులు పడ్డారు. 35,345.2 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇందులో వ్యవసాయ పంటలు 31,751.2, ఉద్యాన పంటలు 3594 హెక్టార్లలో ఉన్నాయి. 8,116 ఇళ్లు నీట మునిగాయి. ఏడుగురు వరదలో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. వరద తగ్గుముఖం పట్టడంతో 10 క్యాంపులను మూసేశారు. ఆర్‌అండ్‌బీ పరిధిలో 969 కిలో మీటర్లు దెబ్బతినగా 24 చోట్ల గండ్లు పడ్డాయి. తాత్కాలిక మరమ్మతులకు రూ.1,128 లక్షలు, శాశ్వత మరమ్మతులకు రూ.11,315 లక్షల నిధులు అవసరమౌతాయని గుర్తించారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో దెబ్బతిన్న 113 రోడ్ల తాత్కాలిక మరమ్మతులకు రూ.1,171 లక్షలు, శాశ్వత మరమ్మతులకు రూ.9,098.45 లక్షలు అవసరమని అంచనా వేశారు. నాలుగు మున్సిపాలిటీల పరిధిలో 24.93 కిలోమీటర్ల రోడ్లు, డ్రెయిన్లు 6.395 కిలోమీటర్ల పొడవునా ధ్వంసమయ్యాయి. ఈ మేరకు నష్టం అంచనాలను రూపొందించి కలెక్టర్ నాగలక్ష్మి ప్రభుత్వానికి నివేదించారు.


దాచేపల్లి : ఎండిపోతున్న పత్తి పంట

పల్నాడు జిల్లాలో..

నష్టం.. రూ.56 కోట్లు

● 28,201 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు ● వ్యవసాయ, ఉద్యానశాఖలు ప్రాథమిక అంచనా ● పూర్తి స్థాయిలో లెక్కింపునకు ప్రత్యేక బృందాలు

నరసరావుపేట(ఆంధ్రజ్యోతి): వర్షాలు.. వరదల కారణంగా జిల్లాలో పంటలకు అపార నష్టం వాటిల్లింది. నీట మునగడంతో పంటలు ఆదిలోనే దెబ్బతినడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. పొలాల్లో నీరు నిలిచి పంటలు ఉరకెత్తుతున్నాయి. కాపు దశలోనే పత్తి పంట దెబ్బతినడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వ సాయం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రాథమిక అంచనా ప్రకారం 28,201 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు అధికారులు గుర్తించారు. రెండు రోజుల్లో పంట నష్టం అంచనా 7 వేల ఎకరాలు పెరిగింది. ఈ లెక్కల ప్రకారం ఇప్పటికి దాదాపు రూ.56 కోట్ల వరకు పంట నష్టం వాటిలినట్లు ప్రాథమిక అంచనా. పంట నష్టం పూర్తి స్థాయిలో లెక్కించేందుకు వ్యవసాయ శాఖ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. మండల, గ్రామ స్థాయిలో ఈ బృందాలు పంట నష్టం లెక్కించే ప్రక్రియను బుధవారం జిల్లా అంతటా పారంభించాయి. వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం 27,013 ఎకరాల్లో పత్తి, వరి, కంది తదతర పంటలకు నష్టం వాటిల్లింది. ఉద్యాన పంటలు 1,188 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఉద్యాన పంటలకు భారీగానే నష్టం వాటిల్లింది. 1,187 ఎకరాల్లో అరటి, పసుపు, మిరప తదితర పంటలకు నష్టం వాటిల్లిందని ఉద్యాన శాఖ తెలిపింది. పిడుగురాళ్ల, ముప్పాళ్ల మండలాల్లో పసుపు పంట దెబ్బతింది. నరసరావుపేట, గురజాల, అమరావతి, అచ్చంపేట, పెదకూరపాడు, చిలకలూరిపేట, సత్తెనపల్లి మండలాల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది.

మేమున్నామని.. మీకేం కాదని..

వరద బాధితులకు సినీ ప్రముఖుల సాయం









వరదలతో ఇబ్బంది పడుతున్న తెలుగు ప్రజానీకాన్ని ఆదుకునేందుకు కొంతమంది సినీ ప్రముఖులు ఇప్పటికే తమవంతు సాయాన్ని అందించగా బుధవారం మరికొందరు విరాళాలను ప్రకటించారు. వరద బాధితులను ఆదుకునేందుకు చిరంజీవి రూ. కోటి సాయాన్ని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రుల సహాయనిధికి చెరో రూ. 50 లక్షలు ఇస్తున్నట్లు ఆయన సోషల్ మీడియా వేదికగా తెలిపారు. 'వరద వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులు నన్ను కలిచివేశాయి. పదుల సంఖ్యలో అమాయకులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. అందరూ తమకు తోచినట్లు సహాయ కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలి. ఈ విపత్కర పరిస్థితులు త్వరలోనే తొలగిపోవాలి' అని ఆయన ఆకాంక్షించారు. చిరు తనయుడు రామ్‌చరణ్ సైతం రూ. 50 లక్షల చొప్పున రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి రూ. కోటి విరాళాన్ని ప్రకటించారు. తెలుగు ప్రజలకు అందరూ అండగా ఉండాల్సిన సమయమిదని రామ్‌చరణ్ పేర్కొన్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంగళవారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. కోటి విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి కూడా రూ. కోటి విరాళంగా ఇస్తున్నట్లు ఆయన బుధవారం ప్రకటించారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో వరద బారిన పడిన 400 పంచాయతీలకు ఒక్కోదానికి రూ. లక్ష చొప్పున మొత్తం రూ. నాలుగు కోట్ల సాయాన్ని అందజేయనున్నట్లు తెలిపారు.

అగ్ర కథానాయకుడు ప్రభాస్ తన వంతుగా రూ. రెండు కోట్ల విరాళాన్ని ప్రకటించారు. తెలంగాణకు, ఆంధ్రప్రదేశ్‌కు రూ. కోటి చొప్పున అందజేయనున్నట్లు ఆయన టీమ్ తెలిపింది. అల్లు అర్జున్ రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి రూ. కోటి విరాళంగా ఇస్తున్నట్లు సోషల్ మీడియా ద్వారా తెలిపారు. ఈ విపత్కర పరిస్థితులు తొలగిపోయి ప్రజలంతా సురక్షితంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. వరద బాధితులను ఆదుకునేందుకు అక్కినేని కుటుంబం, గ్రూపు సంస్థలు రెండు రాష్ట్రాలకు కలిపి రూ. కోటి విరాళాన్ని ప్రకటించాయి. ఏపీ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ. 25 లక్షల సాయాన్ని ప్రకటించిన వైజయంతీ మూవీస్ సంస్థ తాజాగా తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ. 20 లక్షల విరాళాన్ని ప్రకటించింది. నిర్మాత అశ్వనీదత్ బుధవారం ఏపీ సీఎం చంద్రబాబు నాయుడును కలిసి చెక్ అందజేశారు. హీరో సాయిదుర్గ తేజ్ ఇరు రాష్ట్రాలకు కలిపి రూ. 20 లక్షలు, విజయవాడలోని అమ్మ ఆశ్రమానికి రూ. 5 లక్షల విరాళం ప్రకటించారు. అలీ, జుబేదా దంపతులు ఇరు రాష్ట్రాలకు కలిపి రూ. ఆరు లక్షలు విరాళంగా ఇస్తున్నట్లు తెలిపారు.

పవన్ కల్యాణ్ - రూ. 2 కోట్లు (ఏపీలోని గ్రామ పంచాయితీలకు రూ. 4 కోట్లు)
ప్రభాస్ - రూ. 2 కోట్లు
చిరంజీవి - రూ. కోటి
రామ్‌చరణ్ - రూ.కోటి
అల్లు అర్జున్ - రూ. కోటి
అక్కినేని కుటుంబం, గ్రూప్ సంస్థలు కలిపి - రూ. కోటి
సాయిదుర్గ తేజ్ -రూ.20 లక్షలు
వైజయంతీ మూవీస్ - రూ. 20 లక్షలు (తెలంగాణకు)
అలీ, జుబేదా దంపతులు - రూ. 6 లక్షలు

సమంతకు గాయం



టాలీవుడ్ కథానాయిక సమంత గాయపడ్డారు. ఈ విషయాన్ని ఆమె బుధవారం సోషల్ మీడియా ద్వారా తెలిపారు. ఎప్పుడు, ఎలా గాయపడ్డారు అనే వివరాలను ఆమె వెల్లడించలేదు. మోకాలి గాయానికి ఆక్యుపంచర్ విధానంలో చికిత్స తీసుకుంటున్నారు సమంత. తన శరీరంలో రెండు సూదులు గుచ్చి ఉన్న ఫొటోను ఆమె షేర్ చేసి, 'గాయాల బారిన పడకుండా యాక్షన్ స్టార్‌ను అవ్వగలనా?' అని సరదాగా స్పందించారు. దీంతో సమంత లీడ్‌రోల్‌లో నటిస్తూ, నిర్మిస్తున్న 'మా ఇంటి బంగారం' చిత్రం షూటింగ్‌లో గాయపడ్డారని భావిస్తున్నారు. ఆమె నటించిన 'హనీ బన్నీ' వెబ్‌సిరీస్ త్వరలో ప్రముఖ ఓటీటీలో స్ట్రీమింగ్ అవనుంది.

లైంగిక వేధింపులకు పాల్పడితే ఐదేళ్ల నిషేధం

నడిగర్ సంఘం మహిళా భద్రతా కమిటీలో తీర్మానం



నటీమణులపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు రుజువైతే చిత్రపరిశ్రమలో పనిచేయకుండా ఐదేళ్లపాటు నడిగర్ సంఘం నిషేధం విధించనుంది. ఈ మేరకు నడిగర్ సంఘం అనుబంధ విభాగమైన మహిళా భద్రతా కమిటీ సమావేశంలో తీర్మానించారు. ఈ కమిటీ సమావేశం బుధవారం నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్, ఉపాధ్యక్షుడు పూచ్చి మురుగన్, కోశాధికారి కార్తీ, కమిటీ అధ్యక్షురాలు రోహిణి సారథ్యంలో కమిటీ సభ్యులు సుహాసిని, ఖుష్బూ, లలిత కుమారి, కోవై సరళ తదితరులు పాల్గొన్నారు. ఇందులో కొన్ని తీర్మానాలు చేసి ఏకగ్రీవంగా ఆమోదించారు. లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఎవరైనా బాధితులు ఫిర్యాదు చేస్తే వాటిపై విచారణ జరిపి నిజమని తేలితే చిత్ర పరిశ్రమలో పనిచేయకుండా ఐదేళ్లపాటు నిషేధం విధించేలా తీర్మానం చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు, న్యాయ సలహాలు ఇప్పించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించనున్నారు. లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని తొలుత హెచ్చరించి, ఆ తర్వాత చర్యలకు ఉపక్రమిస్తారు. కమిటీకి ఫిర్యాదు చేసే బాధితులు మీడియాతో ప్రత్యక్షంగా మాట్లాడకూడదు. యూట్యూబ్‌లో సినీ నటులను కించపరిచేలా మాట్లాడేవారిపై బాధితులు సైబర్ విభాగం పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారికి కమిటీ అన్ని విధాలా సహకరిస్తుంది.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)



కోరమీనా నిన్ను.. కోసుకుంటా ఇయ్యాలా

జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న 'దేవర 1' చిత్రం నుంచి మాస్ నంబర్‌ను విడుదల చేశారు. 'కోరమీనా నిన్ను.. కోసుకుంటా ఇయ్యాలా' అంటూ రామజోగయ్యశాస్త్రి రాసిన పాట వీడియోను విడుదల చేశారు. ఈ పాటలో ఎన్టీఆర్ వేసిన స్టెప్పులు ఆడియన్స్‌తో డాన్స్ చేయించేలా ఉన్నాయి. ఎన్టీఆర్ డాన్స్ ఎలా ఉండాలని అభిమానులు కోరుకుంటారో దాన్ని మించేలా శేఖర్ మాస్టర్ ఈ పాటకు కొరియోగ్రఫీ అందించారు. జాన్వీకపూర్ గ్లామరస్‌గా కనిపించారు. ఎన్టీఆర్‌తో పోటీగా స్టెప్స్ వేశారు. 'దేవర' మీద ఇప్పటివరకూ ఉన్న అంచనాలు ఈ పాటతో నెక్స్ట్ లెవల్‌కు చేరాయి. అనిరుధ్ అందించిన సంగీతం పాటకు ప్రాణం పోసింది. హై యాక్షన్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకుంటున్న 'దేవర' రెండు భాగాలుగా ప్రేక్షకులను అలరించనుంది. మొదటి భాగాన్ని ఈ నెల 27న తెలుగు, తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల చేస్తున్నారు. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కల్యాణ్‌రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ నిర్మిస్తున్నారు.

ఇన్ ప్రోగ్రెస్ — విడుదల వాయిదా



'ఈ నెల ఏడున 'జనక అయితే గనక' సినిమాను విడుదల చేయాలనుకున్నాం.అయితే ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో వరద పరిస్థితుల కారణంగా విడుదల వాయిదా వేస్తున్నాం. నవ్వుల వినోదం పండించే రోజుని త్వరలో ప్రకటిస్తాం. ప్రేక్షకులు అందరూ థియేటర్లలో చూసి ఆస్వాదించాల్సిన సినిమా కనుక ఈ నిర్ణయం తీసుకున్నాం' అని వెల్లడించారు దిల్ రాజు. సుహాస్ హీరోగా రూపుదిద్దుకున్న 'జనక అయితే గనక' చిత్రానికి సందీప్‌రెడ్డి బండ్ల దర్శకత్వం వహించారు. శిరీష్ సమర్పణలో హర్షిత్‌రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. హీరో సుహాస్ మాట్లాడుతూ 'మూవీ ఫైనల్ వెర్షన్ చూశాను. చాలా బాగా నచ్చింది. అందుకే యుఎస్‌ఏ హక్కులు కొన్నాను. ప్రతి దానికీ లెక్కలు చెప్పే మిడిల్ క్లాస్ యువకుడిగా నటించా. దిల్ రాజుగారు ఎంతో సపోర్ట్ చేశారు' అన్నారు.

పిల్లలతో చూడాల్సిన సినిమా



ప్రియదర్శి, విశ్వదేవ్, నివేద థామస్, గౌతమి ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం '35 చిన్న కథ కాదు'. నందకిషోర్ ఈమాని దర్శకత్వంలో రానాదగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో విడుదలవుతున్న సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ 'ఇది పిల్లలతో కలసి చూడాల్సిన సినిమా. దర్శకుడు ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా తెరకెక్కించార'ని ప్రశంసించారు.

మరిచిపోలేని థ్రిల్‌ను పంచుతుంది



వరుస అవకాశాలతో దూసుకుపోతున్నారు మీనాక్షీ చౌదరి. వెంకట్ ప్రభు దర్శకత్వంలో విజయ్ సరసన ఆమె నటించిన 'గోట్' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్) చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను మీనాక్షీ మీడియాతో పంచుకున్నారు.

"ఈ సినిమాలో నాది చాలా మంచి పాత్ర. ఆ పాత్ర నన్ను నేను రిలేట్ చేసుకునేలా ఉంటుంది. దర్శకుడు వెంకట్ ప్రభు ఈ సినిమాలో ప్రతీ క్యారెక్టర్‌ను చాలా బాగా తీర్చిదిద్దారు. ఈ మూవీ షూటింగ్ సమయంలో విజయ్, స్నేహ, లైలా వంటి అనుభవజ్ఞులైన నటుల నుంచి ఎంతో నేర్చుకున్నాను. ఈ సినిమా అందరికీ మరిచిపోలేని థ్రిల్‌ను పంచుతుంది. విజయ్ యాక్టింగ్, వెంకట్ ప్రభు డైరెక్షన్ స్కిల్స్ ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయి" అని చెప్పారు.


ఫిష్ వెంకట్‌కు సాయం



విలన్ పాత్రల్లోనూ తనదైన శైలిలో కామెడీని పండిస్తూ తెలుగు ప్రేక్షకులను నవ్వించిన ఫిష్ వెంకట్ రెండు కిడ్నీలు పాడై దయనీయ స్థితిలో జీవితం వెళ్లదీస్తున్నారు. మెరుగైన వైద్యం కోసం ఖర్చు పెట్టే స్తోమత లేక ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నట్లు ఆయన ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. సినిమాల్లో నటించమని పిలుపు వస్తున్నా ఒంట్లో సత్తువ లేక కొన్నేళ్ల నుంచి ఇంటికే పరిమితమైనట్లు చెప్పారు. ఖర్చులకు చేతిలో పైసా లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని మీడియా ద్వారా తెలుసుకున్న నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు వైద్య ఖర్చుల నిమిత్తం లక్ష రూపాయలను అందజేశారు. ప్రసన్న కుమార్, రామసత్యనారాయణ, కె.అజయ్‌కుమార్, అనిల్ ఈ చెక్కును ఫిష్ వెంకట్‌కు అందజేశారు.



జేఎన్‌టీయూకేలో ఎంటెక్ స్పాన్సర్డ్ కోటా



కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూకే)- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో స్పాన్సర్డ్ కోటా సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. కనీసం ఏడాది అనుభవం ఉన్న వర్కింగ్ ప్రొఫెషనల్స్ దరఖాస్తు చేసుకోవచ్చు.

విభాగాలు-స్పెషలైజేషన్‌లు

- ★ సివిల్ ఇంజనీరింగ్ - స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, సాయిల్ మెకానిక్స్ అండ్ ఫౌండేషన్ ఇంజనీరింగ్, వాటర్ రిసోర్స్ ఇంజనీరింగ్
- ★ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ - హై ఓల్టేజ్ ఇంజనీరింగ్, అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రికల్ పవర్ సిస్టమ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ డ్రైవ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్
- ★ మెకానికల్ ఇంజనీరింగ్ - క్యాడ్/క్యామ్, మెషిన్ డిజైన్, థర్మల్ ఇంజనీరింగ్
- ★ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ - కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ అండ్ సిగ్నల్ ప్రాసెసింగ్, కంప్యూటర్ అండ్ కమ్యూనికేషన్, వీఎల్ఎస్ఐ అండ్ ఎంబెడెడ్ సిస్టమ్స్
- ★ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ - కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ.
- ★ రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్ - రెన్యూవబుల్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్
- ★ బయోటెక్నాలజీ, నానోటెక్నాలజీ, రిమోట్ సెన్సింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ, ఏవియానిక్స్, ఎన్విరాన్‌మెంటల్ ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/ఏఐఎంఈ లేదా ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ/ఫిజిక్స్/బయోటెక్నాలజీ/ఎర్త్ సైన్స్/ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్/జియాలజీ/ఫుడ్ టెక్నాలజీ/ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్/డెయిరీ టెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. గేట్ 2024/జీప్యాట్ 2024/ఏపీ పీజీఈసెట్ 2024 ర్యాంక్ ఉండాలి.

- ★ **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 17
- ★ **వెబ్‌సైట్:** www.jntuk.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/cHqjyDZలో చదవండి.

దిక్సూచి
DIKSUCHI

ఐఐఎఫ్‌టీలో సర్టిఫికెట్ ప్రోగ్రామ్

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- 'ఆన్‌లైన్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఆన్ ఎక్స్‌పోర్ట్ ఇంపోర్ట్ మేనేజ్‌మెంట్'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది వీకెండ్ ప్రోగ్రామ్. ఇందులో ఆరు మాడ్యూల్స్ ఉంటాయి. దీని వ్యవధి నాలుగు నెలలు(150 గంటలు). ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం పన్నెండుంబావు వరకు, సాయంత్రం రెండు నుంచి అయిదుంబావు వరకు సెషన్స్ నిర్వహిస్తారు. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. ప్రోగ్రామ్‌లో భాగంగా అసైన్‌మెంట్లు, అసెస్‌మెంట్లు, ప్రజంటేషన్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు, ఇంటర్నల్ ఎగ్జామ్స్, ఫైనల్ ఎగ్జామ్స్ ఉంటాయి. కోర్సు మెటీరియల్‌కు సంబంధించి లైఫ్ టైమ్ యాక్సెస్ ఇస్తారు. గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 10
- **వెబ్‌సైట్:** www.iift.ac.in

ఆదుకుంటాం.. అండగా ఉంటాం



రేపల్లె మండలం, బొబ్బర్లంక గ్రామంలో పునరావాస కేంద్రంలో ఉన్న ప్రజల సమస్యలు వింటున్న మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్

- ఇళ్లు కోల్పోయిన వారికి పక్కా గృహాలు నిర్మిస్తాం
- పంట దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది
- మంత్రులు అనగాని, గొట్టిపాటి

రేపల్లె, సెప్టెంబరు 4: వరద కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. బుధవారం రేపల్లె మండలం వరద ప్రభావిత ప్రాంతాలైన పెనుమూడి, రాజుకాల్వ, లంకేవానిదిబ్బ, తుమ్మల,పోటుమెరక, నల్లూరుపాలెం గ్రామాల్లో పర్యటించి బాధితులకు అండగా ఉండి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కరకట్టల మరమ్మతులు నిర్వహించని దాఖలాలు లేవన్నారు. వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పుల ఫలితాలను ఇప్పుడు ప్రజలు అనుభవించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. వరద కారణంగా ఇళ్లు కోల్పోయిన వారికి నివేశన స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం ఆర్థికంగా ఆదుకునే దిశగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. సముద్రం నీరు పోటెత్తటంతో లంకేవానిదిబ్బ మత్స్యకారుల గృహాల్లోకి నీరు చేరి చాలా ఇబ్బందులకు గురయ్యారని, వాటన్నింటిని రెండు రోజుల్లో మెరుగు పరుస్తామని చెప్పారు. వేలాది ఎకరాలు నేటికీ నీటిలోనే నానిపోయి పంట కుళ్లిపోయిందని రైతులు తెలిపారన్నారు. రైతుల వద్ద నుంచే వ్యవసాయ శాఖ అధికారులకు ఫోన్ చేసి దెబ్బతిన్న పొలాలకు సంబంధించి తక్షణమే పంట నష్టం అంచనాలను రూపొందించాలని ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ కృష్ణా కరకట్ట వెంబడి ఉన్న గ్రామాలైన పెనుమూడి పల్లెపాలెం, ఓలేరు పల్లెపాలెం,ఫైనేనివారిపాలెం, మోర్తోట, బొబ్బర్లంక, లంకేవానిదిబ్బ తదితర గ్రామాల్లో విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని, విద్యుత్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపడతామని తెలిపారు. వరదల కారణంగా నష్టపోయిన కుటుంబాలను, నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకునే దిశగా ముందుకు వెళ్తుందన్నారు. ఎవరూ అధైర్యపడాల్సిన పనిలేదనీ, టీడీపీ ప్రభుత్వం ప్రజలకు అండగా నిలిచి ఆర్థికంగా ఆదుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు రేపల్లె రామాంజనేయులు, పంతాని మురళీధరరావు, కొపనాతి రాజశేఖర్, గూడపాటి శ్రీనివాసరావు, మేకా వెంకట శివరామకృష్ణ, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు రేపల్లె జానకిరామయ్య, నియోజకవర్గ సమన్వకర్త మత్తి భాస్కరరావు, రేపల్లె పాపారావు, అనగాని శివప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపటి వరకు కొండవీడుకోట సందర్శన నిలిపివేత

యడ్లపాడు, సెప్టెంబరు 4: చారిత్రక కొండవీడుకోట సందర్శనను ఈ నెల 6 వరకు నిలిపివేస్తున్నట్లు జిల్లా అటవీశాఖాధికారి రామచంద్రరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండవీడుకోట ఘాట్ రోడ్డులో పలు చోట్ల కొండచరియలు విరిగిపడిన విషయం తెలిసిందేనన్నారు. విరిగిపడిన కొండచరియలను ఆర్‌అండ్‌బీ అధికారుల సహకారంతో తొలగిస్తున్నామన్నారు. వర్షం పడుతున్నందున కొండచరియలు తొలగింపు పనుల్లో జాప్యం జరుగుతుందన్నారు. అంతేకాకుండ కురుస్తున్న వర్షాలకు కొండచరియలు మళ్లీ విరిగిపడే అవకాశం ఉన్నందున ఈ నెల 6వ తేదీ వరకు కొండవీడు కోట, నగరవనం సందర్శనను నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. పర్యాటకులు గమనించి సహకరించాలని కోరారు.

పీజీ అడ్మిషన్ల సీట్ల కేటాయింపు

పెదకాకాని, సెప్టెంబరు 4: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సైన్సు, ఆర్ట్స్ కళాశాలల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల సీట్లను ఉన్నత విద్యా మండలి కేటాయించింది. రాష్ట్రవ్యాప్తంగా యూనివర్సిటీల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ సీట్ల భర్తీకి నిర్వహించిన ఏపీ పీజీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ 2024 ద్వారా ఈ సీట్లు భర్తీ జరిగింది. కాగా విశ్వవిద్యాలయంలో సైన్సు, ఆర్ట్స్ కోర్సులలో విద్యార్థులకు సీట్లు ఖరారు కావడంతో విద్యార్థులు వర్సిటీకి వచ్చి ఆయా విభాగాలను సందర్శించి ప్రవేశాలు పొందుతున్నారు. బుధవారం నుంచి పీజీ అడ్మిషన్లకు వచ్చే విద్యార్థుల కోలాహలం వర్సిటీలో మొదలైయింది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ ప్రవేశాలను చేపట్టారు. అయితే సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 10వ తేదీ వరకు ఆయా విభాగాల్లో చేరేందుకు పీజీ సెట్ కన్వీనర్ అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా పీజీ అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ పి. బ్రహ్మాజీరావు వర్సిటీ కళాశాలలో పీజీ సీట్ల భర్తీ సంతృప్తికరంగా ఉన్నట్లు పేర్కొన్నారు.

విజిలెన్స్ అధికారిగా సూర్య శ్రవణ్ కుమార్

గుంటూరు సిటీ, సెప్టెంబర్ 4 : గుంటూరు ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారిగా డి సూర్య శ్రవణ్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఏఎస్పీగా పనిచేస్తున్న ఆయన్ను గుంటూరు విజిలెన్స్ ప్రాంతీయ అధికారిగా నియమించారు. గురువారం ఉదయం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

వరద బాధితులకు రూ. 25 లక్షల విరాళం



సీఎంకు చెక్కు అందిస్తున్న ఆలపాటి, రాయపాటి, క్లబ్ పాలక వర్గ ప్రతినిధులు

గుంటూరు, సెప్టెంబరు 4: ఎల్‌వీఆర్ అండ్ సన్స్ క్లబ్ పాలక వర్గ ప్రతినిధులు సీఎం చంద్రబాబును కలసి రూ. 25 లక్షల చెక్కును అందించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, చుక్కపల్లి రమేష్, పాలకవర్గ ప్రతినిధులు గౌరవ అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, అధ్యక్షులు మైనేని బ్రహ్మేశ్వరరావు, ఉపాధ్యక్షులు వణుకూరి శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి యాగంటి దుర్గారావు, సంయుక్త కార్యదర్శి కొండ్రగుంట శ్రీనివాసరావు, కోశాధికారి యేల్చూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వరద బాధితులకు విజ్ఞాన్ వర్సిటీ చేయూత

గుంటూరు(విద్య), సెప్టెంబరు 4: విజయవాడలోని వరద బాధితులకు విజ్ఞాన్ వర్సిటీ చేయూత అందించినట్లు వీసీ ఆచార్య పి.నాగభూషన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వడ్లమూడిలోని యూనివర్సిటీ నుంచి వరుగా రెండో రోజు ఆరు ప్రత్యేక బస్సుల్లో పదివేల కిచిడి ప్యాకెట్లు ,పెరుగు అన్నం, వాటర్ ప్యాకెట్లు పంపినట్లు వెల్లడించారు. కష్టసమయంలో ప్రతి ఒక్కరూ తమవంతు సహాయం చేయాలనే స్ఫూర్తితో తాము వరద బాధితులకు అండగా నిలిచినట్లు తెలిపారు. విజయవాడలోని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరంలో ఆహారం అందజేశామని తెలిపారు. విద్యార్థులు, వివిధ విభాగాల డీన్లు పాల్గొన్నారు.

కృష్ణమ్మకు సారె సమర్పణ

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 4: గత నాలుగు రోజులుగా భారీ వరదతో ఉగ్రరూపం దాల్చిన కృష్ణమ్మ శాంతించాలని వేద విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి సీతానగరం పుష్కర ఘాట్ల వద్ద నదికి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. కృష్ణమ్మకు పసుపు, కుంకుమ, సారె సమర్పించారు. కార్యక్రమంలో శ్రీ అహోబిల జీయర్ స్వామి, చిన్న జీయర్ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు, రఘునాథాచార్యులు, శ్రీనివాసాచార్యులు, అనంత స్వామి, శంకర్‌రెడ్డి, వేద విద్యార్థులు స్థానికులు పాల్గొన్నారు.

నేటి నుంచి యథావిధిగా పాఠశాలలు

గుంటూరు(విద్య),సెప్టెంబరు 4: జిల్లాలో నేటి నుంచి విద్యాసంస్థలు యథావిధిగా నిర్వహించాలని డీఈవో పి.శైలజ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ ప్రైవేటు యాజమాన్యాలు యథావిధిగా విద్యాసంస్థల్ని కొనసాగించాలని సూచించారు. బాధితులు ఆశ్రయం పొందుతున్న పాఠశాలలకు మాత్రం సెలవు ప్రకటించాలని హెచ్ఎంలకు సూచించారు. తుఫాను తరువాత పాఠశాలలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో గదుల్ని నిశితంగా తనిఖీ చేయాలని, ఏ సమస్యలు లేని గదుల్లో మాత్రమే తరగతులు నిర్వహించాలని సూచించారు.

వరద బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుంది



గండికి శాశ్వత పరిష్కారంపై చర్చిస్తున్న ప్రత్యేక అధికారి, కలెక్టర్, ఎమ్మెల్యే

- జిల్లా కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, సెప్టెంబరు 4: కృష్ణానది వరద బీభత్సానికి సర్వస్వం కోల్పోయిన బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని జిల్లా విపత్తు నిర్వహణ ప్రత్యేకాధికారి ఎంవీ శేషగిరిబాబు, కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే ఆనందబాబు పేర్కొన్నారు. వరద ఉధృతికి దెబ్బతిన్న లంక గ్రామాల్లో బుధవారం వారు పర్యటించారు. పెసర్లంక గ్రామంలో వైద్య శిబిరాన్ని పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. వరద ప్రభావిత లంక గ్రామాల్లోని అన్ని గృహాలకు వెళ్లి మందులు అందజేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. వరద నీరు చేరిన గృహాలను సందర్శించి బాధితులతో మాట్లాడారు. అనంతరం అరవింద వారధి వద్దకు చేరుకుని మూడు రోజుల క్రితం గండి వద్ద పోసిన కట్ట తెగిపోయిన ప్రాంతాన్ని ఎమ్మెల్యేతో పాటు ప్రత్యేక అధికారి, కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గండి వద్ద శాశ్వత పరిష్కారం చూడాలనీ, భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. గండి విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే అధికారులకు తెలిపారు. కొల్లూరు కరకట్ట దిగువున దెబ్బతిన్న ప్రధాన రహదారికి మరమ్మతులు చేయిస్తున్నామని కలెక్టర్, ఎమ్మెల్యేలు తెలిపారు. ప్రజల రాకపోకలకు ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలని ఎమ్మెల్యే సూచించారు. గృహ సందర్శనలో బాధితులతో మాట్లాడిన కలెక్టర్ ఆహార పదార్థాల పంపిణీపై ఆరా తీశారు. లంక గ్రామాల్లో ప్రజలకు తక్షణ సహాయక చర్యలు అందిస్తామని చెప్పారు. అంటు వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్యం మెరుగు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వైద్య సిబ్బందితో సర్వే నిర్వహించి వైద్య సేవలు అందించాలని శేషగిరిబాబు కలెక్టర్‌కు సూచించారు. లంక గ్రామాల్లో తీసుకోవాల్సిన సత్వర చర్యలపై ప్రత్యేక అధికారి, కలెక్టర్, ఎమ్మెల్యేలు ఆయా శాఖల అధికారులకు సూచనలు చేశారు.

వరద విపత్తు.. భారీగా విరాళాలు



సీఎం చంద్రబాబుకు రూ.25 లక్షల చెక్కు అందజేస్తున్న చుక్కపల్లి రమేష్, రాకేష్

పయనీర్ సంస్థల ఆధ్వర్యంలో...

గుంటూరు, సెప్టెంబరు 4: వరద బాధితులను ఆదుకునేందుకు పయనీర్ సంస్థల ఛైర్మన్ చుక్కపల్లి రమేష్, మేనేజింగ్ డైరెక్టర్ చుక్కపల్లి రాకేష్ ముందుకొచ్చారు. ఈ మేరకు బుధవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి సీఎంఆర్ఎఫ్ కింద రూ.25 లక్షల చెక్కును అందజేశారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తదితరులున్నారు.

- ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు, కార్యదర్శి డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తదితరులు బుధవారం రూ. లక్ష చెక్కును కలెక్టర్ నాగలక్ష్మికి అందజేశారు.

ఐఎంఏ తరఫున..

గుంటూరు (మెడికల్) సెప్టెంబర్ 4: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర నాయకులు ముంపు ప్రాంత ప్రజలను ఆదుకొనేందుకు తమ వంతుగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఐఎంఏ వైద్యులు అందజేసిన మొదటి విడత నగదు రూ.25 లక్షలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు అందజేశారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జయచంద్ర నాయుడు, కార్యదర్శి డాక్టర్ ఫణిధర్, స్టేట్ ప్రెసిడెంట్ ఎలెక్ట్ డాక్టర్ నందకిషోర్, కోశాధికారి డాక్టర్ రవీంద్రరెడ్డి, డాక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సీఎంకు చెక్కు అందజేస్తున్న డాక్టర్ రాయపాటి శ్రీనివాస్

నాగర్జున ఎడ్యుకేషనల్ సొసైటీ వితరణ

గుంటూరు(విద్య), సెప్టెంబరు 4: నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ(ఎన్ఇఎస్) సభ్యులు తమవంతు వితరణ ప్రకటించారు. బుధవారం సొసైటీ ఛైర్మన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఎంను విజయవాడలో కలిసి రూ. 25 లక్షలు చెక్కును అందజేశారు.



సీఎంకు చెక్కు అందజేస్తున్న జేసీ నాయుడు, నందకిషోర్

గుంటూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అమరావతి జేఏసీ నాయకురాలు డాక్టర్ రాయపాటి శైలజ వరద బాధితులకు రూ.5 లక్షల సాయం అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబును బుధవారం కలిసి ఆయనకు రూ.5 లక్షల చెక్కును ఆమె అందజేశారు.

రూ.10 లక్షలు విరాళం

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబర్ 4: వరద బాధితుల సహాయార్థం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ అన్నారు. బుధవారం నరేడ్కో గుంటూరు జిల్లా బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి రూ.10 లక్షల విరాళం చెక్కును, వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ చెలికాని సీతారామయ్య రూ.10 వేలు విరాళం అందించారు.

కలెక్టర్ పిలుపు

గుంటూరు సిటీ, సెప్టెంబర్ 4: ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలని కలెక్టర్ నాగలక్ష్మి పిలుపునిచ్చారు. దిగువ పేర్కొన్న అక్కౌంట్స్ ద్వారా సహాయం అందించాలన్నారు. అకౌంట్ పేరు: కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్, గుంటూరు జిల్లా అకౌంట్ నెంబర్: 33260919895, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఐడీఎఫ్‌సీ 0081061 పేరుతో చెక్కులు, డీడీలు నేరుగా పంపవచ్చని, దాతల వివరాలు ప్రకటిస్తామని తెలిపారు.



సీఎంకు చెక్కును అందజేస్తున్న శైలజ

ప్రమాదకరంగా నది రిటైనింగ్ వాల్



వరద ఉధృతికి కూలిన రిటైనింగ్ వాల్

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 4: గత నాలుగు రోజులుగా ప్రకాశం బ్యారేజి దిగువకు భారీగా వరదనీరు ప్రవహించడంతో సీతానగరం డౌన్‌లో నది వెంబడి ఉన్న రిటైనింగ్ వాల్ ప్రమాదకర స్థితికి చేరింది. నీటికి నానిపోయి ఇప్పటికే మూడు చోట్ల 10 అడుగుల మేర కూలిపోయింది. మరో రెండు చోట్ల పూర్తిగా పగుళ్ల వచ్చి కూలడానికి సిద్ధంగా ఉంది. వరదనీరు చూసేందుకు బ్యారేజి దిగువకు సందర్శకుల తాకిడి పెరిగింది. వారు ఆ వాల్‌పై కూర్చుంటూ ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటున్నారు. ఏదైనా జరగరాని ఘటనలు జరిగితే కృష్ణానది వరద ఉధృతిలో పడి ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంది. పోలీసు సిబ్బంది అక్కడ బారికేడ్లు పెట్టి హెచ్చరికలు జారీ చేసినా సందర్శకులు పెడచెవిన పెడుతున్నారు. సంబంధిత నీటిపారదల శాఖ అధికారులు రిటైనింగ్ వాల్ పటిష్టతకు చర్యలు తీసుకోవాలని సీతానగరం వాసులు కోరుతున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.05
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

మాజీ మంత్రి రోజా కళ్లున్న కబోది



కత్తెర హెన్రీ క్రిస్టినా

గుంటూరు సిటీ, సెప్టెంబరు 4 : సీఎం చంద్రబాబు నాయుడు కార్యక్షేత్రంలో ఉండి విజయవాడలో సహాయ కార్యక్రమాలు ముమ్మరంగా చేపడుతుంటే మాజీ మంత్రి రోజా నోరు పారేసుకోవటం దుర్మార్గం అని జడ్పీ ఛైర్ పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా అన్నారు. కూటమి ప్రభుత్వం జరుగుతున్న మంచిని చూడలేని కళ్లున్న కబోది రోజా అని ఆమె విమర్శించారు. సహాయక చర్యలపై రోజా ఇష్టానుసారంగా మాట్లాడిన నేపథ్యంలో జడ్పీ ఛైర్ పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా విలేకరులతో మాట్లాడారు. 74 ఏళ్ల వయస్సులో విరామం లేకుండా ప్రజలందరికీ సాయం అందాలని, విజయవాడ తిరిగి యథాస్థితికి చేరుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రులు, ఎమ్మెల్యేలు సహాయ సహకారాలు అందిస్తుంటే రోజా ఎక్కడో కూర్చుని ముఖ్యమంత్రిని, డిప్యూటీ సీఎంను, ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఒక వీడియో రిలీజ్ చేయటం విడ్డూరంగా ఉందన్నారు. ఒక ఆహార ప్యాకెట్ కూడా అందించలేని వైసీపీ అధ్యక్షుడు జగన్, రోజా కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడం దారుణ మన్నారు. ప్రకృతి విపత్తులు అకస్మాత్తుగా సంభవిస్తాయనీ, వాటిని ఎవరు ఆపలేరు అనే విషయాన్ని రోజా తెలుసుకోవాలన్నారు. బుడమేరుకు గేట్లు లేవనే విషయం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి తెలియకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు.

44,704 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 46,675 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 44,704 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 23,540 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	15700	334	8000	15500
నెంబరు. 5	8000	13500	నెంబరు. 5	9000	12000
273	10000	12000	273	11000	11000
341	8600	14000	341	9000	16200
4884	9200	15000	4884	11000	13000
సూపర్ 10	-	-	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18600	తేజ	8000	18500
బ్యాడిగి	8500	13700	బ్యాడిగి	8500	12700
దేవనూరు డీలక్స్	10000	13800	దేవనూరు డీలక్స్	9500	15000
తెల్లకాయలు	4500	11500	తెల్లకాయలు	5500	10000

నిత్యావసరాల కిట్లను పరిశీలించిన కలెక్టర్



గుంటూరు సిటీ, సెప్టెంబర్ 4 : నందివెలుగు రోడ్డులో ఉన్న పౌర సరఫరాల గిడ్డంగిలో వరద బాధిత కుటుంబాలకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్న నిత్యావసర సరకుల కిట్లను బుధవారం జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి పరిశీలించారు. తాడికొండ, గుంటూరు అర్బన్, గుంటూరు రూరల్, మంగళగిరి, తాడేపల్లి మండలాలకు చెందిన 2700 కుటుంబాలకు ఈ నిత్యావసర సరకుల కిట్లను అందజేయనున్నారు. ఒక్కొక్క కిట్‌లో 25 కిలోల బియ్యం, ఒక కేజీ చొప్పున కందిపప్పు, పంచదార, పామాలిన్ ఆయిల్, బంగాళాదుంప, ఉల్లిపాయాలను ఒక కిట్‌గా చేసి కుటుంబానికి పంపిణీ చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మత్స్యకారులు, నేత కార్మికుల కుటుంబాలకు 50 కేజీల బియ్యం అందించాల్సి ఉందన్నారు. తెనాలి, దుగ్గిరాల, కొల్లిపర మండలాలకు సంబంధించి తెనాలి పౌర సరఫరాల శాఖ గిడ్డంగి నుంచి నిత్యావసర సరకులను వరద బాధితుల సహాయార్థం పంపిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నందివెలుగు రోడ్డులోని ఎంఎస్ఎల్ గోడౌన్‌లో ఉన్న రైస్ నాణ్యతను, తూకాన్ని, ప్యాకింగ్ విధానాన్ని పరిశీలించారు. జిల్లా పౌర సరఫరాల సంస్థ జనరల్ మేనేజర్ లక్ష్మీ, గుంటూరు తూర్పు మండల తహసీల్దార్ నగేష్ పాల్గొన్నారు.

13 న జడ్పీ స్టాండింగ్ కమిటీల సమావేశం

గుంటూరు సిటీ, సెప్టెంబరు 4 : ఉమ్మడి జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీల సమావేశం ఈ నెల 13న ఏర్పాటు చేశారు. ఉదయం 10.30 గంటల నుండి 12.30 గంటల వరకు ఈ సమావేశాలు వేరు వేరు గా జరగనున్నాయి. సమావేశాల నిర్వహణ సమాచారాన్ని జడ్పీ సీఈవో వసంతారాయుడు జిల్లా కలెక్టర్ కు బుధవారం లేఖ ద్వారా తెలిపారు.

ముగ్గురి ఏవోలపై అభియోగాల నమోదు

గుంటూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఫెర్టిలైజర్స్ డీలర్లను ప్రోత్సహించారన్న ఫిర్యాదుల్లో ప్రాథమిక ఆధారాలున్నట్లు నిర్ధారణ కావడంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో విధులు నిర్వహించిన ముగ్గురు వ్యవసాయ అధికారులపై ప్రభుత్వం విచారణ నిర్వహించాలని నిర్ణయించింది. వీరిలో ఒక జాయింట్ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్, మండల వ్యవసాయాధికారి ఉన్నారు. ఫెర్టిలైజర్స్‌ని రైతు భరోస కేంద్రాలకు తెప్పించడం, అక్కడ నుంచి రైతులకు విక్రయించే విషయంలో ముగ్గురు అధికారులు నిర్లక్ష్యం వహించారు. దీని వలన రైతులు ప్రైవేటు డీలర్ల వద్దకు వెళ్లి అధిక ధరకు ఫెర్టిలైజర్స్‌ని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని అప్పట్లో ఫిర్యాదులు రావడంతో ఈ మేరకు బుధవారం వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ బుడితి రాజశేఖర్ జారీ చేసిన ఉత్తర్వులు ఆ శాఖలో చర్చనీయాంశంగా మారాయి. రేపల్లె నియోజకవర్గంలోని నిజాంపట్నం మండలం రైతు భరోస కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఫెర్టిలైజర్స్ స్టాక్‌ని పొజిషన్ చేయడంలో అప్పటి ఉమ్మడి గుంటూరు జిల్లా అధికారులు నిర్లక్ష్యం వహించారు. అప్పటి మండల వ్యవసాయాధికారి ఎం చంద్రశేఖర్, అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్ ఉషారాణి, జాయింట్ డైరెక్టర్ ఎం విజయభారతిపై అభియోగాలను నమోదు చేసి విచారణ చేపట్టాలని నిర్ణయించింది. .

కొనసాగిన విజిలెన్స్ తనిఖీలు

గుంటూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టిన విజిలెన్స్ అధికారులు రెండో రోజు తనిఖీలు కొనసాగించారు. బుధవారం విజిలెన్స్ సీఐ ఏ శ్రీహరిరావు, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ఇతర సిబ్బంది యార్డు పరిపాలన భవనంలో ఫైళ్లను స్వాధీనం చేసుకొన్నారు. వాటన్నింటిని కలెక్టరేట్ ప్రాంగణంలోని ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కార్యాలయానికి తరలించారు. ఆయా ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించి, అధికారులు, వ్యాపారస్తులు, హమాలీలు, వేమెన్‌ల నుంచి స్టేట్‌మెంట్‌లు రికార్డు చేసి ఆ తర్వాత ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు విజిలెన్స్ వర్గాలు తెలిపాయి.

పల్నాడు వార్తలు

మాచర్ల గురజాల సత్తెనపల్లి పెదకూరపాడు



ఎమ్మెల్యే యరపతినేనిని కలిసిన వ్యాపార, లైమ్ అసోసియేషన్ ప్రతినిధులు

లైమ్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

పిడుగురాళ్ల, సెప్టెంబరు 4: పిడుగురాళ్ల లైమ్ అసోసియేషన్ నేతలు బుధవారం పట్టణంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోట హరినారా యణ, గౌరవ అధ్యక్షుడిగా మల్లెల ఆదినారాయణ, పల్చూరి నాగేశ్వరరావు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే జనరల్ సెక్రటరీగా కొలిశెట్టి ఈశ్వరరావు, కోశాధికా రిగా పచ్చిపులుసు పాపయ్యగుప్తా, కమిటీ సభ్యులుగా ఎల్‌వీఆర్, నందిపాటి శ్రీనివాసరెడ్డి, కొనకండ్ల భాస్కరరావు, దాచేపల్లి మధు, బొడ్డు గోపి, కొత్త సైదారావు, బ్రాహ్మణపల్లి శ్రీనివాసరావు, చీదెళ్లసాంబ, బొమ్మి శివరామకృష్ణలు ఎన్నికయ్యారు. పిడుగురాళ్లలో లైమ్ అసోసియేషన్ అభివృద్ధికి కృషిచేస్తామని నూతనంగా ఎన్నికైన కమిటీ నేతలు తెలిపారు. అనంతరం స్థానిక టీడీపీ కార్యాలయంలో పట్టణానికి చెందిన పలువురు వ్యాపారులు, లైమ్ అసోసియే షన్ నూతన కార్యవర్గ సభ్యులు గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస రావును మర్యాదపూర్వకంగా కలిశారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

మాచర్లటౌన్, సెప్టెంబరు 4: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ప్రజలకు సూచించారు. ఆరోగ్య కార్యకర్తలు గ్రామాల్లో, వార్డుల్లో పర్యటిస్తు న్నారని, వారిచ్చే సూచనల ప్రకారం ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఇటీవల వర్షాలు, వరదల నేపథ్యంలో నీరు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. మున్సిపల్, పంచాయతీ అధికారులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి సూచించారు.

రహదారికి మరమ్మతులు

మాచర్ల రూరల్, సెప్టెంబరు 4: ఇటీవల వర్షాలకు మాచర్ల - విజయపురి సౌత్ ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతినగా, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానం దరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం అధికారులు మరమ్మతులు చేపట్టారు. కొప్పునూరు, బెల్లంకొండవారిపాలెం, అనుపు, కొత్తపల్లి, చింతలతండా, విజయ పురిసౌత్ వద్ద రహదారులకు కూడా మరమ్మతులు నిర్వహించారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మాచర్లటౌన్, సెప్టెంబరు 4: భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతు లను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ రైతు సంఘం నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు మేకల శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యా లయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల వర్షాలకు వేలాది ఎకరాల్లో పత్తి దెబ్బతిందని, వ్యవసాయ శాఖాధికారులతో బాధిత రైతులను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో టౌన్ సెక్రటరీ మిద్దెపోగు బాబురావు, సీహెచ్ లింగారెడ్డి, ఎం రామకోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సహాయక చర్యల్లో సీఎం కృషి హర్షణీయం

గురజాలటౌన్, సెప్టెంబరు 4: విజయవాడలో వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించి, బాధితులకు భరోసానిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన కృషి హర్షణీయమని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కటికం అంకారావు అన్నారు. బుధవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి, పవన్‌కల్యాణ్ తన సొంత నిధులు రూ.6 కోట్లను బాధితుల కోసం కేటాయించారన్నారు. జనసేనపార్టీలో పనిచేయడం తనకు గర్వంగా ఉందన్నారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస రావు రెండు రోజుల క్రితం పది రైళ్లు అధిక వర్షాల కారణంగా రూట్ మళ్లిస్తే ఆయా ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా భోజన సదుపాయాలు, పండ్లు పంపిణీ చేయటం అభినందనీయమని అంకారావు తెలిపారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

నకరికల్లు, సెప్టెంబరు 4 : వినాయక చవితిని పురస్కరించుకొని వినాయక స్వామి విగ్రహాలు ఏర్పాటుచేసే కమిటీల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు శాఖ అనుమతి తీసుకోవాలని నకరికల్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక పోలీసు స్టేషన్‌లో నకరికల్లులో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసే కమిటీలతో సమావేశం నిర్వహించారు. నకరికల్లు తో పాటు మండలంలోని అన్ని ప్రాంతాల్లో విగ్రహాలు ఏర్పాటుచేసే కమిటీలు పోలీసు అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యార్థినులకు వైద్యపరీక్షలు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 4: స్థానిక ఇందిరమ్మ కాలనీలోని కస్తూర్బా పాఠశాలలో బాలికలకు బుధవారం వైద్యులు రక్తపరీక్షలు నిర్వహించారు. పలువురు విద్యార్థినులకు రక్తహీనతతో వున్న వారిని గుర్తించి వారికి సరైన పోషకాహారం అందించే విధంగా తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో ఐసీడీఎస్ కార్యాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విమర్శలు మానండి..

సాయం చేయండి

మాచవరం, సెప్టెంబరు 4 : విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు పడుతున్న కష్టాలను చూసి చలించిన సీఎం చంద్రబాబు రాత్రి, పగలు తేడా లేకుండా సహాయక చర్యల్లో పాల్గొంటుంటే మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి పనికిమాలిన ఆరోప ణలు చేయటం దుర్మార్గమని నరసరావుపేట పార్లమెంటరీ తెలుగు రైతు సంఘం ఉపాధ్య క్షుడు చెన్నయ్యచౌదరి అన్నారు. బుధవారం మండలంలోని మోర్జంపాడు గ్రామంలో స్థానిక టీడీపీ నేతలతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వరదల్లో ప్రజలు అనేక బాధలు పడుతుంటే వారికి అండగా ఉండాల్సింది పోయి, ప్రభుత్వంపై విమర్శలు చేయటం సరికాద న్నారు. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పది వేల మందికి నడికూడి రైల్వే జంక్షన్‌లో ఆహారం అందజేశారని, వైసీపీ నేతలు ఏం చేశారో చెప్పా లని ప్రశ్నించారు. చౌకబారు విమ ర్శలు మాని చేతనైనే సాయం చేసేందుకు ముందుకు రావాలని వైసీపీ నేతలకు సూచించారు. సమావేశంలో తెలుగు యువత మండల మాజీ అధ్యక్షుడు రాంబాబు, నేతలు గద్దె శ్రీకాంత్, మండల బీసీ నాయకులు పాపయ్య పాల్గొన్నారు.

గండి పూడ్చివేత

పిడుగురాళ్ల, సెప్టెంబరు 4: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోగల యరపతినేని నగర్‌కు వెళ్లే రహదారి కల్వర్టు వద్ద పడిన గండిని అధికారులు బుధవారం ఎక్సకవేటర్‌తో పూడ్చి వేశారు. ఇటీవల వర్షాలకు ఆ మార్గంలో గండి పడటంతో స్థాని కులు ఎమ్మెల్యే యరపతినేని దృష్టికి తీసుకుపోగా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు గండిని పూడ్చారు.



మంత్రి అచ్చెన్నాయుడుతో ఆహారం అందిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



బాధితులకు నిత్యవసరాలు అందిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సహాయక చర్యల్లో ఎమ్మెల్యేలు

- విమర్శలు కాదు.. చేతనైతే సాయం చేయండి
- వరద బాధితులకు అండగా నిలవండి .. కూటమి నేతలు
- విజయవాడకు ఆహారం, నిత్యావసరాలు, తాగునీరు..

మాచర్లటౌన్, సెప్టెంబరు 4: విజయవాడలోని పలు ముంపు ప్రాంతాల్లో చేపడుతున్న సహాయక చర్యల్లో మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మా నందరెడ్డి రెండో రోజూ పాల్గొన్నారు. విజయవాడలోని చిట్టినగర్, సింగ్ నగర్ ప్రాంతాల్లో మంత్రి అచ్చెన్నాయుడుతో కలిసి ఆయన పర్యటించారు. ట్రాక్టరుపై ఇంటింటికి తిరుగుతూ, బాధితులను పరా మర్శిస్తూ, వారికి ఆహారాన్ని, సరుకులను అందజేశారు. ఎవరూ అధైర్య పడవద్దని సాధారణ స్థితికి వచ్చే వరకు ప్రభుత్వం అందరికీ అండగా నిలుస్తూ సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. అనంత రం అక్కడి సహాయక చర్యలపై అధికారులతో చర్చించారు.

స్పందించిన పరాశక్తి సిమెంట్ యాజమాన్యం

రెంటచింతల: ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పిలుపు మేరకు పరాశక్తి సిమెంట్ యాజమాన్యం తక్షణమే స్పందించింది. విజయవాడ వరదబాధితుల సహాయార్థం కంపెనీ యాజమాన్యం అందజేసిన 4వేల వాటర్ బాటిళ్లు, 5 వేల బిస్కట్ ప్యాకెట్లు, 100 దుప్పట్లను స్థానిక తహసీల్దారు కరుణకుమార్, కంపెనీ ఉద్యోగి కీసర వేణుగోపాల్ రెడ్డిలు ప్రత్యేక వాహనాల ద్వారా గుంటూరు కలెక్టరేట్ రెవెన్యూ ఉన్నతాధికారి వినాయకంనకు అందజేశారు.

విజయవాడ వరద ప్రాంతాల్లో ఎమ్మెల్యే కన్నా పర్యటన

సత్తెనపల్లి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ బుధవారం కూడా విజయవాడలోని 15వ డివిజన్‌లో పర్యటించి వరద బాధితులను పరామర్శించారు. ప్రతి ఇంటికి వెళ్ళి ఆహార పొట్లాలు, పాలు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. తాగు నీరు, ఆహారం కలుషితం కాకుండా తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

విజయవాడకు వాటర్ బాటిల్స్, సరుకులు

సత్తెనపల్లి ఆర్డీవో మురళీకృష్ణ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది బుధవారం విజయవాడ వరద బాధితుల సహాయార్థం పది వేల బిస్కెట్ ప్యాకెట్లు, 20వేల వాటర్ బాటిల్స్, 10 వేల అగ్గి పెట్టెలు, క్యాండిల్స్‌ను తరలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చక్రవర్తి, సివిల్ సప్లయ్ డీటీ అరుణ, ఆర్డీవో కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

నందిగామ వాసుల సాయం

సత్తెనపల్లిరూరల్: విజయవాడవరద బాధి తులకు మండలంలోని నందిగామ వాసులు అండగానిలిచారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారా యణ సూచనల మేరకు గ్రామ స్థులు, టీడీపీ నేతలు, జీడీసీసీ బ్యాంక్ సిబ్బంది సుమారు రూ.1.50 లక్షల విలువైన దుస్తులు, వాటర్ బాటిల్స్, బిస్కెట్లు, క్యాండిల్స్, కూరగాయలు, వంట సరుకులను సేకరించి బుధవారం విజయవాడ తరలించి ఎమ్మెల్యే కన్నా చేతుల మీదుగా బాధితులకు పంపిణీ చేయించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆళ్ళ అమరేశ్వరరావు, సర్పంచ్ బలిజేపల్లి రమా దేవి, ఆళ్ళ సాంబయ్య, బలిజేపల్లి విజయ కుమార్ పాల్గొన్నారు.

మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది కలసి ఒక లారీకి సరిపడా సరుకులను వరద బాధితులకు సేకరించారు. వాటర్ బాటిల్స్ క్యాండిల్స్, వంట సరుకులు తదితర వాటిని ప్యాక్ చేసి వరద బాధితుల సహాయార్థం అందజేశారు.

క్రోసూరు: క్రోసూరుప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో విజయవాడ బాధితుల కోసం వాటర్‌బాటిల్స్, బిస్కెట్‌ప్యాకెట్లు, క్యాండిల్స్, నిత్యావసరాలను అందజేస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ సిరి చందన, డాక్టర్ మహమ్మద్ సాద్‌లు తెలిపారు. ఈ సామగ్రిని జిల్లా ఆరోగ్యకేంద్రం నుంచి ప్రత్యేక వాహనాల్లో విజయవాడకు తరలించను న్నట్టు తెలిపారు. ఆరోగ్య విస్తరణాధికారి శిఖాశ్యామ్‌సన్, హెల్త్ అసిస్టెంట్ ఫ్రాంక్లిన్‌చౌరవతో ఈబాధ్యతను నిర్వర్తించినట్లు తెలిపారు.

మాచవరం: వరద బాధితుల సహాయార్థం స్థానిక టీడీపీ నేతలు, మండల అధికారులు 7200 మంచి నీటి బాటిల్స్, మూడు వేల కొవ్వొత్తులు, సుమారు రూ.20 వేలు విలువ చేసే బిస్కెట్ ప్యాకెట్లను నరసరావుపేట కలెక్టర్ కార్యాలయానికి పంపించినట్లు టీడీపీ నేత యడ్లపల్లి రామారావు తెలిపారు.

దాచేపల్లి: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సాగర్ సిమెంట్స్, చెట్టినాడ్ సిమెంట్స్, ఎంపీపీ కార్యాలయ సిబ్బంది, చిప్స్ అండ్ పల్వరైజింగ్ యూనియన్ ఆధ్వర్యంలో వాటర్‌బాటిల్స్, బిస్కెట్ ప్యాకెట్లు, కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు, టార్చిలైట్లు కొనుగోలు చేసి కలెక్టర్ కార్యాలయం నుంచి సరఫరాచేశారు. అలాగే నారాయణపురంలో నవసమారిటన్ సేవాసంస్థ ఆధ్వర్యంలో మత్స్యకారుల కుటుం బాలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

పిడుగురాళ్ల: విజయవాడ వరద బాధితుల సహాయార్థం టంగుటూరి వెంకట సుబ్బారావు చారిటబుల్ ట్రస్టు, దియ్యా చారిటబుల్ ట్రస్టు, ఎస్ఎల్ఎన్ గ్రూపు, కిషోర్ మైక్రో మిన రల్స్, శారద ట్రేడింగ్ కంపెనీ తరపున తాగునీరు, ఆహార పదార్థాలను ప్రత్యేక వాహనంలో తరలించారు. ఎమ్మెల్యే యరపతి నేని శ్రీనివాసరావు ఆయా వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు.



విజయవాడకు ఆహార పదార్థాలు తీసుకెళ్లే వాహనానికి పచ్చజెండా ఊపుతున్న ఎమ్మెల్యే యరపతినేని



చెట్టినాడ్ సిమెంట్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో తరలిస్తున్న వాటర్ బాటిల్స్, కొవ్వొత్తులు, బిస్కెట్లు



గుంటూరు డీఆర్వో వినాయకంకు సామగ్రి అందచేస్తున్న పరాశక్తి సిమెంట్ యాజమాన్యం



సరుకులను విజయవాడకు పంపుతున్న సత్తెనపల్లి ఆర్డీవో మురళీ, తహసీల్దార్ చక్రవర్తి



వాటర్ బాటిల్స్, బిస్కెట్ ప్యాకెట్లు పంపిస్తున్న మాచవరం టీడీపీ నాయకులు, అధికారులు

9న గెస్ట్ లెక్చరర్ పోస్టులకు ఇంటర్వ్యూ

మాచర్లరూరల్, సెప్టెంబరు 4: మండలంలోని విజయపురిసౌత్‌లో గల ఏపీఆర్‌డీసీలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు ఈనెల 9న ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వైఎన్ఎస్ చౌదరి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో కామర్స్ 2, ఎకనామిక్స్ 1, కెమిస్ట్రీ 1, తెలుగు 1, మ్యాథమేటిక్స్ 1, కంప్యూటర్ సైన్స్ 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. సంబంధిత సబ్జెక్ట్‌లో 55 శాతం మార్కులు కలిగి ఇంగ్లీష్ మీడియంలో బోధించే వారికి ప్రాధాన్యం ఉంటుంద న్నారు. అర్హులైన వారు ఈనెల 9న ఉదయం 10 గంటలకు కళాశా లలో హాజరుకావాలన్నారు. వివరాలకు సెల్: 7036318863ను సంప్ర దించాలని సూచించారు.

దాడి కేసులో వైసీపీ నేతల అరెస్టు

మాచర్లటౌన్, సెప్టెంబరు 4: పట్టణంలోని జెండా చెట్టు బజారులో ఈ ఏడాది మార్చి 2న జూలకంటి బ్రహ్మానందరెడ్డి రాకను పురస్క రించుకొని టీడీపీ నేతలు తమ పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుంటుండగా వైసీపీ నేతలు వారిపై దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటనపై బాధితుడు టీడీపీ నేత షేక్ మోసిన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అయితే ఆ సమయంలో పోలీసులు కేసు నమోదు చేయలేదు. దీంతో టీడీపీ నేతలు మాచర్ల కోర్టును ఆశ్రయించారు. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు 19 మంది వైసీపీ నేత లను నిందితులుగా గుర్తించి కేసు నమోదు చేశారు. కాగా వీరిలో 9 మందిని బుధవారం అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ ప్రభాకరరావు తె లిపారు. మిగతా 10 మంది పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వర లోనే అరెస్టు చేస్తామన్నారు. అరెస్టయిన వైసీపీ నేతల్లో షేక్ మస్తాన్ వలి,మహ్మద్‌రఫీ, నాగుల్‌మీరా, జానీబాషా,యూసఫ్, అబ్దుల్ అజీజ్, మహ్మద్ ఖాసీం, మరొకరు ఉన్నారని సీఐ ప్రభాకరరావు తెలిపారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఎస్ఐ సుధీర్‌కుమార్

దుర్గి, సెప్టెంబరు 4: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ సుధీర్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరి ధిలోని కోలగుట్లలో యువతకు వాలీబాల్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు యువత ప్రధాన పాత్ర పోషించాలన్నారు. రాజకీ యాలకు దూరంగా ఉంటూ క్రీడా స్ఫూర్తిని పెంచుకోవాలని, మద్యం, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు.

ఘనంగా వన మహోత్సవం

అచ్చంపేట,సెప్టెంబరు4: అచ్చంపేటలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ టీ అరుణ్‌కుమార్ అధ్యాపక బృందం, విద్యార్థులు సపోట, బత్తాయి, జామ మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎన్ఈ జీఎస్ ఏపీవో శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పోషకాహార వారోత్సవాలు

వెల్దుర్తి, సెప్టెంబరు 4: మండలంలోని మందాడి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషకాహార వారోత్సవాలను ఘనంగా నిర్వ హించారు. సూపర్ వైజర్ దుర్గా పోషకాహర ప్రయోజనాలను వివ రించారు. ప్రస్తుతకాలంలో రసాయనాల ప్రభావంతో ఆహారం కలుషి తమై అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పోషకాలు తీసుకోవడం వలన ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో కుమారి, రుక్మిణి, విజ య లక్ష్మి, అన్నపూర్ణ, జయభారతి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పంట నష్టం నమోదు

- జిల్లా వ్యవసాయ అధికారి మురళి
- వరద ముంపు ప్రాంతాల్లో దెబ్బతిన్న పొలాల పరిశీలన

పెదకూరపాడు, సెప్టెంబరు 4 : వరద ముంపు ప్రాంతాల్లో పంట నష్టం అంచనాజాబితాను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా వ్యవ సాయ అధికారి ఐ.మురళి అన్నారు. బుధవారం ఆయన నియోజ కవర్గ పరిధిలోని పాటిబండ్ల గ్రామంలో వ్యవసాయ శాఖ సిబ్బందితో కలిసి వరద ముంపునకు దెబ్బతిన్న పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబరు 10 లోపు పంట నష్టం అంచనా జాబితాను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు శ్రీధర్‌రెడ్డి,శాంతి పాల్గొన్నారు.

క్రోసూరు: వర్షాలతో దెబ్బతిన్న పంటల నమోదును బుధవారం క్రోసూరు మండలంలో ప్రారంభించినట్లు మండల వ్యవసాయ అధి కారి వీ.వేణుగోపాల్ తెలిపారు. 33శాతం కన్నా ఎక్కువ పంట నష్టం జరిగిన పైర్లను పరిహారం జాబితాలో చేర్చుతున్నట్లు తెలిపారు. పంట నష్టం నమోదులో గ్రామస్థాయిలో రైతు సేవాకేంద్రం సిబ్బంది, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, మండలస్థాయిలో మండల వ్యవ సాయ అధికారి, ఎంపీడీవో, తహసీల్దార్ పాల్గొంటారని తెలిపారు. అందుకూరు, బాలెమర్రు గ్రామాల్లో వివరాలు సేకరించారు.



పాటిబండ్లలో పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మురళి

అచ్చంపేట: మండలంలోని ఓర్వకల్లు, రుద్రవరం, కోనూరు, కస్తల, చింతపల్లి గ్రామాల్లో పొలాలను వ్యవసాయ సహాయ సంచాలకులు బీ.హనుమంతరావు, ఏవో వీ.వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఇప్పటికే మండలంలోని అన్ని గ్రామాలకు నష్టం అంచనా వేసేందుకు టీమ్‌లు వేసి ఉన్నామని వారు తెలిపారు.

సత్తెనపల్లి రూరల్ : మండలంలోని నందిగామలో అధిక వర్షాలకు గురైన పంట పొలాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీ పరిశీలించారు. ఇన్‌చార్జ్ ఏడీఏ శ్రీధర్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు గోపీకృష్ణ, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.



వరద బాధితులకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

యుద్ధప్రాతిపదికన

రహదారుల మరమ్మతులు చేపట్టాలి

- అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, సెప్టెంబరు 4 : క్రోసూరు - అమరావతి ఆర్‌అండ్‌బీ రహదారి మరమ్మతు పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఊటుకూరులో ప్రర్యటించిన ఆయన ఊటుకూరు-బయ్యవరం గ్రామాల మధ్యనున్న కప్పలవాగు పొంగి ప్రవహిం చడం వలన కొట్టుకుపోయిన ఆర్అండ్‌బీ రహదారిని పరిశీలించారు. స్థానిక టీడీపీ నాయకులతో కలసి కప్పలవాగు వద్దకు వెళ్ళి పరిస్థితిని సమీక్షించారు. రహదారి కొట్టుకు పోవటంతో నాలుగు రోజులుగా క్రోసూరు, అమరావతి మధ్య రాకపోకలు పూర్తిగా స్తంభించి పోయాయని, కనీసం ద్విచక్ర వాహనాలు కూడా నడిచే పరిస్థితి లేదని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సాధ్యమైనంత త్వరగా మరమ్మతులు చేపట్టి రాకపోకలు పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని అవధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర తెలుగు మహిళా అధికార ప్రతినిధి వేగుంట రాణి, టీడీపీ నాయకులు వానిరెడ్డి మల్లేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు గుడిపాడు బాషా, జనసేన నాయకులు శాఖమూరి శ్రీనివాసరావు పలువురు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

అమరావతి: మండల పరిధిలోని ధరణికోట, దిడుగు, మల్లాది గ్రామాల్లో వరద ముంపునకు గురైన బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ బుధవారం నిత్యావసరాలను పంపిణీ చేశారు. అనంతరం మునగోడు గ్రామంలో పంటలను పరిశీలించారు. పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటానని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ నాగమల్లేశ్వరరావు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ప్రజలను అప్రమత్తం చేయాలి

మాచర్ల రూరల్, సెప్టెంబరు 4: కృష్ణానదికి ఒడ్డున ఉన్న గ్రామాల ప్రజ లను అప్రమత్తం చేయాలని డీపీవో భాస్కరరెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం మండలంలోని ఏకోనాంపేట, విజయపురిసౌత్ గ్రామాలను ఆయన సందర్శించారు. అనంతరం మాచర్ల పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. నీరు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు జ్వరాల భారిన పడే ప్రమాదం ఉందన్నారు. తుఫాన్ ప్రభావం వలన వర్షాలు పడే అవకాశం ఉన్నందున పాత మిద్దెలలో నివాసం ఉండేవారి వివరాలు సేకరించి, అవసరమైనవారిని సురక్షిత ప్రాంతా లకు తరలించాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవోలు సరోజినిదేవి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

మాచర్లటౌన్, సెప్టెంబరు 4: పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆలయ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసిం హారావు మాట్లాడుతూ.. ఆలయ ఉత్సవాలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు కమిటీ నేతలు, సభ్యులు కృషి చేయాలన్నారు. కార్యక్ర మంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కూనిశెట్టి వెంకటేశ్వర్లు, సూరె యలమంద, కొత్తమాసు వెంకటబ్రహ్మారావు, భవనాశి వెంకటేశ్వర్లు, సన్నిధి హనుమంతు రావు, సైదారావు, గోళ్ల జనార్ధనారవు, కూనిశెట్టి చిన వెంకటేశ్వర్లు, పోలూరి సత్యనారాయణ, జనార్ధనరావు, నాగేశ్వరరావు, చెన్నకేశవరావు, రవితేజ, కొత్త శ్రీదేవి, ధనలక్ష్మి, విజయలక్ష్మి, వెంకటలక్ష్మి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో తనిఖీ

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 4 : మండలంలోని పెద మక్కెన గ్రామంలో గల ఎరువుల దుకాణంలో జిల్లా వ్యవసాయ అధికారి ఐ మురళీ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువులు, పురుగు మందుల నిల్వలను స్టాక్ రిజిస్టర్‌ను ఆయన పరిశీలించారు. ఎరువులు, పురుగు మందులు అమ్మకాలు జరినప్పుడు డీలర్లు తప్పనిసరిగా రైతుకు బిల్లు ఇవ్వాలని, బిల్లుపై రైతు, డీలర్ సంతకం, రైతుఫోన్ నెంబరు ఉండాలన్నారు. స్టాక్ బోర్డుపై వివరాలు నమోదు చేయాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ ఏడీఏ శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

రుచి కరమైన ఆహారాన్ని అందించాలి

బెల్లంకొండ, సెప్టెంబరు 4 : విద్యార్థులకు మంచి రుచి కరమైన ఆహారాన్ని అందించాలని బెల్లంకొండ మండల తహసీల్దార్ ఆస్రిఫున్నీబేగం సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక జడ్పీ హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో వెంకటరెడ్డితో కలసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లా డుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారాన్ని అందించాలని సూచించారు. ఎంపీడీవో వెంకటరెడ్డి, తహసీల్దార్ మధ్యాహ్న భోజనం నాణ్యతను తనిఖీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, వీఆర్వో వెంకయ్య, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

0.1ఎంయూ విద్యుత్ ఉత్పత్తి

రెంటచింతల,సెప్టెంబరు 4 : నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ ప్రాజెక్టులో ఏడు రోజుల తర్వాత రెండు టర్బైన్ల నుంచి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించి నట్లు ఎస్ఈ వెంకటరమణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాగర్ నుంచి ఉధృతంగా వరద నీరు రావడంతో గత నెల 28న విద్యుత్ తయారీని నిలిపి వేశామన్నారు. బుధవారం సాయంత్రం 6 గంటల వరకు 0.1 ఎంయూ విద్యుత్ తయారయిందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 74.34 మీటర్ల మేర నీరుండగా, ఇది 6.3040 టీఎంసీలకు సమానమని పేర్కొన్నారు.

సహాయక చర్యలపై

శ్రేణులతో ఎమ్మెల్యే టెలీకాన్ఫరెన్స్

పెదకూరపాడు, సెప్టెంబరు 4 : వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలపై నియోజక వర్గంలో 1500 మంది కూటమి శ్రేణులతో ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహిం చారు. గత మూడు రోజులుగా కురిసిన వర్షలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, విపత్తులను ఎదుర్కొనేలా నాయకులు, అధికారులు సకాలంలో స్పందించి సహాయక చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. రానున్న రెండు రోజుల్లో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఇందుకు అవసరమైన ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి గ్రామంలో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామని, వైద్య పరీక్షలు చేయటంతో పాటు అవస రమైన మందులను వైద్య సిబ్బంది పంపిణీ చేస్తారని వివరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా డయల్ యువర్ ఎమ్మెల్యే ఫోన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు. సమస్యలను త్వరిత గతిన పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపడతామని తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేప ట్టాలని, వ్యాధులు ప్రబల కుండా చర్యలు తీసుకోవాలని అధికారు లను ఆదేశించినట్టు తెలిపారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

అసత్య ప్రచారాలు మానుకోవాలి

● జగన్‌రెడ్డి విమర్శలపై ఎమ్మెల్యే జీవీ ఆగ్రహం

వినుకొండ, సెప్టెంబరు 4: విపత్తుల్లో సాధ్యమైనంత వరకు ప్రజలను ఆదుకోవాల్సింది పోయి, రాజకీయాలకు వాడుకోవడం వైసీపీ, జగన్‌రెడ్డి రాక్షసత్వానికి పరాకాష్ఠని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పీకల్లోతు నీళ్లల్లో మునిగి ఉన్న ప్రజలకు కావాల్సిన ఆహారం, మందులు సాయం చేయాల్సిందిపోయి జగన్ అడ్డగోలుగా తప్పుడు ప్రచారాలు చేయడం ఎంతవరకు సమంజసమని జీవీ ప్రశ్నించారు. ఎన్నికల్లో ప్రజలు ఛీకొట్టి తిరస్కరించినా జగన్‌కు బుద్ధిరాలేదన్నారు. ప్రజలను అబద్ధాలతో మోసగించవచ్చని అనుకుంటే పొరపాటేనని, విజయవాడను ముంచిందే జగన్‌రెడ్డి అని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో బుడమేరుకు కనీసం మరమ్మతులు చేపట్టకపోవడంతో విజయవాడను వరదలు ముంచెత్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంపై బురదచల్లడం దివాళాకోరుతనానికి నిదర్శనమని అన్నారు. గడిచిన ఐదేళ్లలో బుడమేరు బాగు కోసం ఏంచేశారని నిలదీశారు. వాగులు వంకలు పూడికతీతలు, ఆక్రమణలు తొలగింపుపై సరైన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని అన్నారు. వరద సమయంలో సాయం అందలేదని జగన్ అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అమరావతిపై కుట్రలు చేయడం జగన్‌కు అలవాటైందని చెప్పారు. ఇసుక మాఫియా కారణంగా అన్నమయ్య ఆనకట్ట కొట్టుకుపోయి 45మంది ప్రాణాలు పోయాయని, వేలాదిమంది నష్టపోయారని ఆ సందర్భంగా గుర్తుచేశారు. ఇకనైనా జగన్ శవాలపై పేలాలు ఏరుకునే చిల్లర పనులు మానుకోవాలని, జగన్ పత్రికల్లో, సోషల్ మీడియాల్లో తప్పుడు ప్రచారాలు ఆపాలని హితవు పలికారు.

బాధితులందరికీ పభుత్వం అండగా నిలుస్తుంది

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 4: ప్రతి ఒక్క బాధితునికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. బుధవారం విజయవాడ నగరంలో 40వ డివిజన్‌లో ఇంటింటికి తిరిగి నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఇప్పటికే నరసరావుపేట నుంచి తాగునీటి ట్యాంకర్లను పంపించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ స్వయంగా నిత్యావసరాలను పంపిణీ చేశారు. రెండు రోజులుగా వరద ప్రభావిత ప్రాంతాలలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు వరద ప్రభావిత ప్రాంతాలలో బియ్యం, కందిపప్పు, వంటనూనె, తాగునీరు, పంచదార, టీపొడి కిట్లను అందించారు. ఇంతటి ఉపద్రవం ముంచుకొచ్చినా చంద్రబాబునాయుడు ముందుచూపుతో ప్రాణనష్టం లేకుండా చేసుకోగలిగారన్నారు. భవిష్యతులో ఇలాంటి పరిస్థితి రాకుండా ఇప్పటికే చర్యలు ప్రారంభించామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాదు, షేక్ మాబు, షేక్ బాబు, ఎ.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

అమూల్యమైనవి నర్సింగ్ సేవలు

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



విద్యార్థులకు సర్టిఫికెట్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, డాక్టర్ చదలవాడ ఆదిత్య, జాయింట్ సెక్రటరీ పాలడుగు శ్రీనివాసప్రసాద్ తదితరులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 4: నర్సింగ్ సేవలు అమూల్యమైనవని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేట పీఎన్‌సీ అండ్ కేఆర్ విద్యాసంస్థలలో బీఎస్సీ, జీఎన్ఎం విద్యార్థుల గ్రాడ్యుయేషన్, లాంప్ లైటింగ్ కార్యక్రమం నిర్వహించామని ప్రిన్సిపాల్ డీ గోపినాథ్ బుధవారం తెలిపారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ నర్సులు శాంతిదూతలన్నారు. బులియన్ మర్చంట్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, డాక్టర్ చదలవాడ ఆదిత్య, జాయింట్ సెక్రటరీ పీ శ్రీనివాసప్రసాద్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుజి కల్పనా, సాయినాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

సదరం క్యాంపునకు 60మంది డుమ్మా

వినుకొండ టౌన్, సెప్టెంబరు 4: పట్టణంలోని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో గుంటూరుకు చెందిన ప్రత్యేక వైద్య బృందం బుధవారం సదరం క్యాంపు నిర్వహించారు. బొల్లాపల్లి మండలంలో మొత్తం 220మంది దివ్యాంగులకు గాను, 160 మంది మాత్రమే క్యాంపునకు హాజరయ్యారు. మిగిలిన 60మంది మూడు రోజులుగా జరిగిన క్యాంపునకు హాజరు కాకపోవడంతో నకిలీ సర్టిఫికెట్స్‌తో పింఛను పొందుతున్నట్లు క్యాంపు కార్యాలయం వద్ద గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా క్యాంపునకు హాజరైన వారిలో కొందరు చెవిటితనంతో పింఛను పొందుతుండగా, వైద్యులు వారిని పరీక్షించే నేపథ్యంలో ఆధార్‌కార్డు చూపించాలని కోరారు. బాదితుడు ఆధార్ చూపించగా వైద్యులు ఆ వ్యక్తిని పరీక్ష చేయకుండానే బయటకు పంపించారు. ఇలా ఐదు సంవత్సరాల్లో ఎంతోమంది సదరం సర్టిఫికెట్స్ పుట్టించి దివ్యాంగుల పింఛను పొందుతున్నట్లు ఆరోపణలున్నాయి. వినుకొండలో గుట్టు చప్పుడు కాకుండా అధికారుల చేపట్టే సదరం క్యాంపు వద్దకు సచివాలయాల్లో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్స్ వచ్చి పైరవీలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. గ్రామ సచివాలయాల్లో ఉండాల్సిన వెల్ఫేర్ అసిస్టెంట్, క్యాంపు కార్యాలయాల వద్ద కన్పించటంపై పలు అనుమానాలకు తావిస్తోంది. వినుకొండ మండలం దొండపాడు గ్రామానికి చెందిన 35మంది దివ్యాంగులకు వినుకొండలో పరీక్షలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో దొండపాడు సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ క్యాంపు కార్యాలయం వద్దనే ఉండటంపై పలు అనుమాలు రేకెత్తిస్తున్నాయి. సదరం క్యాంపు కార్యాలయాల వద్ద జరిగే పైరవీలపై చర్యలు తీసుకోవాలని, నిజమైన దివ్యాంగులను గుర్తించాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయంపై వినుకొండ ఇన్‌చార్జి ఎంపీడీవో వీరభద్రాచారిని వివరణ కోరగా ఆయన స్పందించలేదు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

నూజెండ్ల, సెప్టెంబరు 4: అడవి పందులకు వేటగాళ్లు వేసిన విద్యుత్ వైర్లకు రైతు బలైన సంఘటన మండలంలోని తంగిరాల గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఆవుల మంద ఏడుకొండలు(53) తన గేదెలు రాత్రి సమయమైనా ఇంటికి రాకపోవటంతో తన బంధువులైన దేవరపు సిద్ధయ్య, కర్లకుంట అనీల్‌ను తోడు తీసుకొని గ్రామం పక్కనే ఉన్న రెవెన్యూ, అగ్రహారం భూముల్లో వెతుకుతుండగా అడవి పందుల కోసం వేటగాళ్లు వేసిన విద్యుత్ వైర్లు తగిలి ఏడుకొండలు షాక్‌తో మృతి చెందాడు. కొద్ది దూరంలో ఉన్న సిద్ధయ్య, అనీల్‌కు కూడా గాయాలైయ్యాయి. విషయం తెలుసుకున్న ఐనవోలు ఎస్ఐ టీవీ కృష్ణారావు సంఘటనా స్థలాన్ని బుధవారం ఉదయం పరిశీలించి భార్య వెంకట రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ తంగిరాల గ్రామానికి చెందిన ప్రజలు పెద్దసంఖ్యలో పోలీస్‌స్టేషన్ ఎదుట కొద్దిసేపు ఆందోళన చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి, మరొకరికి గాయాలు

వినుకొండటౌన్, సెప్టెంబర్ 4: ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనంపై కిందపడి ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని వెంకుపాలెం గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. బాధిత బంధువులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే, శావల్యాపురం మండలం పోట్లూరు గ్రామానికి చెందిన గడిపూడి అంజయ్య, చింత సతీష్‌లు ద్విచక్రవాహనంపై ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం, పుల్లలచెరువు గ్రామానికి వెళ్లారు. సతీష్ భార్య పిల్లలను కలుసుకుని, తిరిగి ద్విచక్రవాహనంపై వినుకొండ వస్తుండగా మార్గంమధ్యలోని వెంకుపాలెం వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడి గడిపూడి అంజయ్య(52) అక్కడి కక్కడే మృతి చెందగా, చింత సతీష్‌కు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది సతీష్‌ను వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతిచెందిన అంజయ్యను పోలీసులు పోస్టుమార్టం కోసం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, పంచనామ అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతుడికి భార్య, కుమార్తె కలరు.

అనుమతి లేని వాహనాల సీజ్

వినుకొండ, సెప్టెంబరు 4: పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాస్ ఆదేశాల మేరకు జిల్లా స్పెషల్ బ్రాంచి సిబ్బంది, వినుకొండ పట్టణ సీఐ యూ శోభన్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పత్రాలు, నంబర్ ప్లేట్లులేని సుమారు 100కుపైగా ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా లైసెన్సు ధ్రువీకరణ పత్రాలు లేకుండా సంచరిస్తే చర్యలు తీసుకుంటామని, మైనర్లుకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పార్టీ జెండాలు పెడితే చర్యలు: ఎస్ఐ

ఈపూరు, సెప్టెంబరు 4: పందిళ్ల వద్ద పార్టీ జెండాలు పెడితే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు తెలిపారు. విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలని ఎస్ఐ ఎం ఉమామహేశ్వరరావు బుధవారం ఆటోకు మైక్ పెట్టి మండలంలో ప్రచారం నిర్వహించారు.

పౌష్టికాహారంతో రక్తహీనత తగ్గుముఖం

● పౌష్టికాహార మాసోత్సవంలో కలెక్టర్ అరుణ్‌బాబు



మాసోత్సవంలో ఏర్పాటుచేసిన ఫుడ్ స్టాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

నరసరావుపేట కల్చరల్, సెప్టెంబరు 4: పౌష్టికాహారం, వ్యాయామంతో పిల్లల్లో రక్తహీనత లోపాన్ని అధిగమించవచ్చని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. బుధవారం పట్టణంలోని శంకరభారతిపురం ఉన్నత పాఠశాలలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 1 నుంచి 30 వరకు పౌష్టికాహార మాసోత్సవం జరుగుతుందని, ఇందులో భాగంగా రక్తహీనతపై అవగాహన కల్పించి, రక్తపరీక్షలు నిర్వహించి, నివారణ చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమ ముఖ్య ఉద్దేశం గ్రోత్ మానిటరింగ్, కాంప్లిమెంటరీ ఫీడింగ్, పోషణ్ భీ, పడాయి భీ, ఓవర్ ఆల్ న్యూట్రిషన్ అన్నారు. రక్తహీనత వల్ల నిస్సత్తువగా ఉండటం, ఏకాగ్రత తగ్గడం వంటి లక్షణాలు ఉంటాయని, సాంకేతికతతో ప్రతి రెండు నెలలకు ఒకసారి రక్తపరీక్షలు నిర్వహించి రక్తహీనత ఉన్న వారిని గుర్తించి, నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. పచ్చదనం పెంపు వలన మంచి గాలి అందుతుందని, విద్యార్థులు ప్రతి ఒక్కరు పచ్చదనాన్ని పెంపొందించే దిశగా ఒక మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఉమారాణి మాసోత్సవాల గురించి అవగాహన కల్పించారు. జిల్లా వైద్య అధికారి బి.రవికుమార్ రక్తహీనతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఈవో ఎం.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫుడ్‌స్టాల్‌ను కలెక్టర్ పరిశీలించారు.

నక్కవాగు కరకట్టకు 42 చోట్ల గండ్లు




జగ్గాపురం - తుర్లపాడు గ్రామాల మధ్య కోతకు గురైన నక్కవాగు కరకట్ట

యడ్లపాడు, సెప్టెంబరు 4: ఇటీవల కురిసిన భారీ వర్షాల కు నక్కవాగుకు వరద పోటెత్తింది. దీనితో దిగువ గ్రామాలైన జగ్గాపురం, జాలాది, తుర్లపాడు గ్రామాల పరిధిలో నక్కవాగుకు ఇరువైపులా ఉన్న కరకట్టలు కోతకు గురికావడంతో పాటు గండ్లు ఏర్పడి పొలాలను ముంచెత్తాయి. జగ్గాపురం - తుర్లపాడు గ్రామాల మధ్య కరకట్టకు ఇరువైపులా 42 గండ్లు ఏర్పడటంతోపాటు, పలు చోట్ల కట్టలు కోతకు గురై మట్టి దిబ్బలు వాగులోకి జారాయి. మరో మారు వరద వస్తే పం ట పొలాలతోపాటు గ్రామాల్లోకి వరద నీరు చేరే ప్రమాదం ఉందని, కోతకు గురై వాగులోకి జారిన మట్టి దిగువ ప్రాంతాలకు కొట్టుకుపోయి మేటలు వేసే ప్రమాదం ఉందని ఆయా గ్రామాల రైతులు చెబుతున్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

నరసరావుపేట కల్చరల్, సెప్టెంబరు 4. పలనాడు జిల్లాలో ఈ విద్యా సంవత్సరానికిగాను బెస్ట్ టీచర్స్ అవార్డు - 2024 ఎంపికైన ఉపాధ్యాయుల వివరాలను పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు బుధవారం ప్రకటించారు. జిల్లాకుచెందిన గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులలో 1. గోపరాజు బసవరాజు (జడ్పీహెచ్ఎస్, రెంటపాళ్ల) 2. బి.పద్మజా (జడ్పీహెచ్ఎస్, మోర్జంపాడు) 3.రామరాజు చంద్రశేఖర్ (జడ్పీహెచ్ఎస్, అడిగొప్పుల) 4. ఎస్.శాంతి (జడ్పీహెచ్ఎస్, బెల్లంకొండ), 5.నర్రెడ్డి రామకృష్ణారెడ్డి (జడ్పీహెచ్ఎస్, ఈపూరు) 6. కె.వి.రమణ (జడ్పీహెచ్ఎస్, పెదకూరపాడు) 7. షేక్ నజీర్‌అహ్మద్ (జడ్పీహెచ్ఎస్, గుండ్లపల్లి, నకరికల్లు మండలం) 8. ఘంటశాల విజయభారతి (జడ్పీహెచ్ఎస్, యడ్లపాడు) 9.యడవల్లి హనుమంతరావు (జడ్పీహెచ్ఎస్, పసుమర్రు) 10.పోతిన వేణుగోపాలరావు (ట్రైబల్ రెసిడెన్షియల్ ఫర్ బాయ్స్, కారంపూడి) 11. జి.జ్యోత్స్న దీప్తి(ప్రిన్సిపాల్, కేజీబీవీ, అచ్చంపేట) కాగా పీఎస్ హెచ్.ఎం లలో 12. వేదాంతం మురళి గోపాలమూర్తి (పిల్లుట్ల) 13. గోసు ప్రసాదరావు (ఎంపీపీఎస్, మిలిటరీ కాలనీ, పిడుగురాళ్ల) 14. గుడిపాటి సాంబశివరావు (ఎంపీపీఎస్, భారతపురం, వినుకొండ) 15.జి.దేవరాజు (ఎంపీపీఎస్ (మెయిన్), చామర్రు) 16.కుమ్మరి శ్రీనివాసరాజు (ఎస్.ఎ జడ్పీహెచ్ఎస్, శావల్యాపురం) 17.నంబూరి సుందరరావు (ఎస్.ఎ. జడ్పీహెచ్ఎస్, గుత్తికొండ) 18.షేక్ జాన్ (ఎస్.ఎ. ఎంపీయూపీ, చినతురకపాలెం) 19. డొప్పలపూడి దేవరత్నం (ఎస్ఏ జడ్పీహెచ్ఎస్, పిడుగురాళ్ల) 20. కల్లం రత్నరాజు (జడ్పీహెచ్ఎస్, గణపవరం) 21.తనిమెద్ది అంజిరెడ్డి (ఎస్.ఎ. జడ్పీహెచ్ఎస్, కాకాని) 22. సవరం సునీత (ఎస్.ఎ. ఎంపీయూపీఎస్. రుక్మిణిపురం) 23.బాణావతు వెంకట రమణనాయక్ (ఎస్.ఎ. జడ్పీహెచ్ఎస్, పిడుగురాళ్ల) 24. మేడా సాంబశివరావు (ఎస్.ఎ.జడ్పీహెచ్ఎస్, జొన్నలగడ్డ) 25. మొగిలి వెంకట నాగయ్య (ఎస్.ఎ. ఎంపీయూపీఎస్, మాచవరం, రొంపిచర్ల(మం) 26.వంగూరి డేవిడ్ విల్సన్ (ఎస్.ఎ. జడ్పీహెచ్ఎస్, మాచర్ల), 27. చాపలమడుగు మస్తాన్ సాహెబ్ (ఎస్.ఎ. జడ్పీహెచ్ఎస్, వినుకొండ) 28.బెల్లం నాగ శైలజా రాణి (ఎస్.ఎ. జడ్పీహెచ్ఎస్, గణపవరం), 29. మల్లవరపు అశోక్ కుమార్ (ఎస్.ఎ. జడ్పీహెచ్ఎస్, నకరికల్లు) 30. వల్లెపు శ్రీను (పీజీటీ, ఏపీ మోడల్ స్కూల్, ఈపూరు) 31. అనుపోజు సోమ సూర్య ప్రకాశరావు (ఎస్.ఎ. జడ్పీహెచ్ఎస్, కంభంపాడు) 32. చేగు ఉదయభాస్కర్ (ఎస్.ఎ. జడ్పీహెచ్ఎస్, మండెపూడి, అమరావతి (మం) 33. జి.శైలజ (ఎస్ఎ. జడ్పీహెచ్ఎస్, కారంపూడి) 34.వాంకుడావత్ కోటానాయక్ (ఎంపీయూపీఎస్, కనుమల చెరువు, బొల్లాపల్లి (మం) 35.బొల్లాపల్లి యేసురత్నం (ఎస్.ఎ. ఎంపీయూపీ, నడికూడి) 36.జల్లిపల్లి శారద (ఎస్.ఎ. ఎస్సార్కే ఓరియంటల్ హైస్కూల్, నరసరావుపేట) 37.షేక్ ఆయేషా సుల్తానా (ఎస్.ఎ.జడ్పీహెచ్ఎస్ (గరల్స్) మాచర్ల) 38. పెండ్యాల ప్రసాద్ (ఎస్.ఎ. జడ్పీహెచ్ఎస్, సాతులూరు) 39. చింతా చినఓబయ్య (ఎస్.ఎ. జడ్పీహెచ్ఎస్, నకరికల్లు) 40.గొట్టిపాటి కార్తయ్య (ఎస్.ఎ. పీడీ, జడ్పీహెచ్ఎస్, కంభంపాడు) 41.కృష్ణంశెట్టి వెంకట నాగరాజు (పి.డి. జడ్పీహెచ్ఎస్, చిరుమామిళ్ల) 42. షేక్ బాజి(పీడీ జడ్పిహెచ్ఎస్, కనపర్రు), 43.గండు సాంబశివరావు (పి.డి. 88-తాళ్లూరు) 44.జనమాల శ్రీనివాసరావు (పి.డి.జడ్పీహెచ్ఎస్, కారంపూడి) 45.కుంభా కోటేశ్వరి (పి.డి. జడ్పీహెచ్ఎస్, కుంకల గుంట, నకరికల్లు(మం) 46.మద్దినేని వెంకట కోటయ్య (ఎస్‌జిటి, ఎంపీపీఎస్, పెదకొదమగుండ్ల) 47.చింతకింది వెంకట కోటేశ్వరరావు (ఎస్‌జీటీ, ఎంపీపీఎస్, మాదినపాడు, దాచేపల్లి (మవ) 48.తాళ్లూరి శ్రీనివాసరావు (ఎస్‌జిటి, ఎంపీపీఎస్, పిడుగురాళ్ల) 49. మోపిదేవి శివ శంకరరావు (ఎస్‌జిటి, ఎంపీపీఎస్, పులిపాడు, గురజాల (మం) 50.శిగిరిశెట్టి వేణుగోపాల రావు (ఎస్‌జిటి, ఎంపిపిఎస్, కొత్తపల్లి, అచ్చంపేట(మం) 51.మండ్రు శ్రీధర్(ఎస్‌జిటి, ఎంపియూపి, కె.జి.పాడు, మాచవరం (మం) 52.మాలెంపాటి పద్మావతి (ఎస్‌జిటి, ఎంపిపియస్ (హెచ్ఇ),.దరణికోట, అమరావతి (మం) 53. ఎనుముల మల్లికార్జునరావు (ఎస్‌జిటి, ఎంపిపిఎస్, కొత్తపల్లి, రొంపిచర్ల (మం) 54.జైనబ్ జహాబేగం (ఎంపిపిఎస్ (ఉర్దూ) రాజాపేట, చిలకలూరిపేట (మం) 55. దీవి నర్సింహమూర్తి (ఎంపిపిఎస్, ఎస్.బి.పురం, నరసరావుపేట(మం) 56.చేపల కోర్లయ్య (ఎంపిపిఎస్, వి.బి.పురం, మాచర్ల) 57.బిళ్లా రాజారమేష్ (ఎంపిపిఎస్, తుమ్మలకుంట, శావల్యాపురం (మం) 58.కన్నెబోయిన బాల కృష్ణారావు (ఎంపిపిఎస్, కె.ఉప్పలపాడు, నూజెండ్ల (మం) 59.నల్లపు ఆదినారాయణ (ఎంపిపిఎస్, ద్వారకాపురి, మాచర్ల(మం), 60. కుంభా శ్రీనివాసరావు (ఎంపిపిఎస్, అన్నవరం, రొంపిచర్ల(మం) 61.యలమల రామయ్య (ఎంపిపిఎస్, మునుమాక, రొంపిచర్ల (మం) 62.ఎస్.ఇస్సాక్ (ఎంపిపిఎస్, న్యూస్కూల్, అమరావతి. 63.కన్నెబోయిన బాలకృష్ణారావు (ఎంపిపిఎస్, కె.ఉప్పలపాడు, నూజెండ్ల (మం) 64. సుకుమార్ (ఎంపిపిఎస్, గుండ్లపల్లి, నకరికల్లు (మం) 65. కొమ్ము కిషోర్ (జడ్‌పిహెచ్ఎస్, వెల్దుర్తి, వెల్దుర్తి(మం) 66. చిలకా వీరయ్య (ఎంపిపిఎస్, చిలకలూరిపేట) 67.గర్నెపూడి ఇస్రాయేల్ ప్రసాద్ (పిఇటి, ఎస్‌బీఆర్ మున్సిపల్ హైస్కూల్, నరసరావుపేట) 68.సిహెచ్. అమృత వాణి (సీఆర్‌టి, కెజీబీవీ, సత్తెనపల్లి). ఉన్నారు.



వరద బాధితులకు లారీలో సరుకుల తరలిస్తున్న తహసీల్దార్, మున్సిపల్ అధికారులు

వరద బాధితులకు అధికారుల సహకారం

వినుకొండ, సెప్టెంబరు 4: విజయవాడలోని వరద బాధితుల కోసం తహసీల్దార్ కార్యాలయం, మున్సిపాలిటీ కార్యాలయం అధికారులు సంయుక్తంగా కలిసి సుమారు రూ.1,30,000వేలు విలువచేసే బిస్కెట్లు, వాటర్ బాటిళ్లు, కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు తదితర సామగ్రిని దాతల సాయంతో సేకరించారు. సేకరించిన వాటిని లారీలో సాయంతో విజయవాడకు తరలించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి శ్రీరాములు, తహసీల్దార్ సురేష్‌లు మాట్లాడుతూ వరద బాధితులకు సాయంచేసిన దిలీప్‌కుమార్, క్రషర్స్ యాజమానులకు, మాదినేని అంజనేయులు, వినుకొండ ఫర్టిలైజర్స్, దాల్‌మిల్, కిరాణా మర్చంట్స్, క్లాత్, గోల్డు షాప్స్ అసోసియేషన్‌తోపాటు, వ్యాపారులైన ఎం.వెంకటేశ్వరెడ్డి, పొట్ల రాధాకృష్ణమూర్తి, ఇమ్మడిశెట్టి సూరిబాబు, పెనుగొండ శ్రీను తదితరులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీహరి, సర్వేయర్ రవి, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాసరావు, వీఆర్‌వోలు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న వాణిజ్యపంటలు

ఈపూరు, సెప్టెంబరు 4: అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు వాణిజ్య పంటలు దెబ్బతిన్నాయి. మండలంలోని కొచ్చెర్లలో 10 ఎకరాల్లో గుమ్మడి, 2.5 ఎకరాల్లో చిక్కుడు పంటలు దెబ్బతిన్నాయి. కాపు దశలో వర్షం రావడంతో పూత రాలిపోయి కాపు ఆగిపోవడం వల్ల ఇప్పటివరకు పెట్టిన రూ.3లక్షలు వరకు నష్టం వచ్చిందని గుమ్మడి పంట సాగు చేసిన రైతు నలబోతుల చిన్న వీరయ్య చెప్పారు. వర్షానికి తోట నేలపాలు కావడంతో రూ1.50 లక్షలు నష్టపోయానని కొచ్చెర్ల తండాకు చెందిన మేరాజోత్ వెంకటనాయక్ తెలిపారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

బొల్లాపల్లి, సెప్టెంబరు 4: మండలంలోని బొల్లాపల్లిలో రెండు రోజులుగా వరద బాధితులకు బొల్లాపల్లి తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేపట్టారు. తుఫాన్ కారణంగా పూర్తిగా దెబ్బతిన్న విజయవాడ వాసులకు సాయంగా టీడీపీ నాయకులు గ్రామంలో జోలెకట్టి విరాళాలు సేకరిస్తున్నారు. కార్యక్రమంలో ఎస్ చిన వెంకటేశ్వర్లు, బీ కోటేశ్వరరావు, షేక్ సుభానీ, షేక్ జానీ బాషా, జీ ఆంజనేయులు, జీ మన్నెయ్య, షేక్ మౌలాలి, బీ బాలాజీ నాయక్, కే ఆంజనేయులు, షేక్ మీరావలి తదితరులున్నారు.

స్వర్ణాంధ్ర-2047ను విజయవంతం చేయాలి

● శావల్యాపురం ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం, సెప్టెంబరు 4: రాష్ట్రాన్ని 2047నాటికి అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర-2047ను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య తెలిపారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని శాఖల అధికారులతో బుధవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.

8న మెగా నేత్ర వైద్య శిబిరం

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 4: డాక్టర్ కోడెల శివప్రసాదరావు చారిటబుల్ ట్రస్ట్, శంకర నేత్రాలయం ఆధ్వర్యంలో 8న ఉచిత నేత్ర వైద్యశిబిరం జరుగుతుందని నిర్వాహికులు బుధవారం తెలిపారు. నరసరావుపేట పట్టణంలోని రాజాగారికోట డాక్టర్ కోడెల శివప్రసారావు ఆసుపత్రిలో ఉదయం 8గంటలకు వైద్యశిబిరం ప్రారంభం అవుతుందన్నారు. జిల్లా ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ప్రపంచంలో అతిపెద్ద పార్టీ బీజేపీ: ఉప్పలపాటి

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 4: ప్రపంచంలో అతిపెద్దపార్టీగా భారతీయ జనతాపార్టీ ఉందని భారతీయ జనతా పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి ఉప్పలపాటి శ్రీనివాసరాజు అన్నారు. బుధవారం నరసరావుపేట పట్టణంలో శివుని బొమ్మ సెంటర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్ బాబు ప్రారంభించారు. ముఖ్యఅతిధిగా హాజరైన ఉప్పలపాటి శ్రీనివాసరాజు మాట్లాడుతూ సుస్థిర పాలనతో భారతదేశం సూపర్ పవర్ దిశగా ఎదుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్‌బాబు, జిల్లా ఇన్‌చార్జి కొక్కెర శ్రీనివాస్, రాష్ట్రనాయకులు, జిల్లా ప్రధాన కార్యదర్శులు, వివిధ మోర్చాల జిల్లా నాయకులు, పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

72మంది రక్తదానం

చిలకలూరిపేట, సెప్టెంబరు 4: స్థానిక తెలుగుదేశం నేత, ఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మల్లెల రాజేష్ నాయుడు జన్మదినం సందర్భంగా ఆయన అభిమానులు బుధవారం రక్తదానం చేశారు. పట్టణంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో 72మంది రక్తదానం చేశారు. చిలకలూరిపేట ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో 80మంది రోగులకు బ్రెడ్లు పండ్లు పంపిణీ చేశారు. బాపూజీ వృద్ధాశ్రమం, సాయి ప్రశాంతి వృద్ధాశ్రమాలలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కోండ్రుపాడు రహదారి పక్కన నివసిస్తున్న 250మంది ఎస్టీలకు అన్నదానంచేసి, దుప్పట్లు పంపిణీచేశారు.

క్రీడల్లో అవకతవకలపై విచారణ చేయాలని వినతి

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 4: కొమెరపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన 66వ, 67వ ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్ 14, 17 స్కూల్ గేమ్స్ పుట్‌బాల్, కబడ్డీలో జరిగిన అవకతవకలుపై విచారణ జరిపించాలని విద్యార్థులు కోరారు. బుధవారం నరసరావుపేటలో డీఈవో ఎం వెంకటేశ్వర్లుకు విద్యార్థులు వినతిపత్రం అందజేశారు.

కష్టకాలంలో ప్రజలకు కావాల్సింది సాయం

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

● వరద బాధితులకు ఆహారం, నీరు అందజేత



వరద బాధితులకు ఆహారం పంపిణీ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, సెప్టెంబరు 4: వరద విలయంలో చిక్కుకుని ఉన్న విజయవాడ ప్రజలకు కావాల్సింది సాయం తప్ప రాజకీయం కాదని మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. బుధవారం చిలకలూరిపేట ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆహార పొట్లాలు, నీటి సీసాలను ప్రత్యేక వాహనంలో విజయవాడకు తరలించారు. ఈ వాహనాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ప్రత్తిపాటి మాట్లాడుతూ విజయవాడ వరద బాధితులను ఆదుకొనేందుకు తలోచేయి వేయాలని సూచించారు. విపత్తు సంభవించిన క్షణం నుంచి పగలు, రాత్రి ప్రజల సేవలోనే ఉన్న ప్రభుత్వానికి చేతనైనసాయం చేయాల్సింది పోయి రాద్ధాంతం చేయాలని చూస్తున్న వారు ఇకనైనా బుద్ధి మార్చుకుంటే మేలని హితవు పలికారు. విజయవాడ వరద బాధితులకు చిలకలూరిపేట నుంచి ఆహార పదార్థాలు, తాగునీరు సరఫరా చేశారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు బాధితులను ఆదుకోవటం కనీస బాధ్యత అని, వరద బాధితులను ఆదుకునేందుకు ప్రెస్ క్లబ్ సభ్యులు స్పందించి ముందుకు రావటం అభినందనీయమన్నారు. ఇదే సమయంలో నీట మునిగిన పంటలను పూర్తిస్థాయి నష్టంగా పరిగణలోకి తీసుకుంటామని, వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ప్రకటించటం రైతులకు ఎంతో ఊరట ఇచ్చే విషయం అన్నారు. ఈ నిర్ణయం ద్వారా రైతులకు పూర్తిస్థాయి పరిహారం అందే అవకాశం ఉంటుందన్నారు. సర్వంకోల్పోయిన అన్నదాతలకు కొండంత అండ అవుతుందని ప్రత్తిపాటి సంతోషం వ్యక్తం చేశారు.

రెండువేల మందికి అల్పాహారం పంపిణీ

యడ్లపాడు, సెప్టెంబరు 4: మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లిలోని ముంపు ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు చిలకలూరిపేట నియోజకవర్గ టీడీపీ ప్రచారకార్యదర్శి ఉడతా వెంకట్రావు అల్పాహారాన్ని పంపిణీ చేశారు. తాడేపల్లిలోని 1 నుంచి 19వ వార్డులలో నివాసం ఉంటున్న రెండువేల మందికి అల్పాహారాన్ని అందించారు. అల్పాహారంగా పులిహోర, బ్రెడ్ ప్యాకెట్లను అందజేసినట్లు వెంకట్రావు తెలిపారు. కార్యక్రమంలో తాడేపల్లి మండల ఇన్‌చార్జి ఎలికా రాఘవులు, మంగళగిరి నియోజకవర్గ టీడీపీ నాయకులు పావులూరి సతీష్, తిమ్మాపురం టీడీపీ నాయకులు బొల్లినేని వీరశేఖర్, బి.అనిల్, పి.ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.



రొంపిచర్ల సుబ్బారెడ్డి కాలనీకి వెళ్ళే రహదారిలో ఒరిగిన విద్యుత్ స్తంభం

ఒరిగిన విద్యుత్ స్తంభం

రొంపిచర్ల, సెప్టెంబరు 4: మండలంలోని గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు రొంపిచర్లలోని సుబ్బారెడ్డి కాలనీకి వెళ్ళే రహదారిలో ఉన్న విద్యుత్ స్తంభం ఒరిగింది. పక్కనే చప్టా ఉండటంతో నీటి ఉధృతికి ఒరిగి, పడిపోయేలా ఉంది. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి స్తంభానికి మరమ్మతులు చేయాల్సి ఉంది.

తొమ్మిది మంది జూదరుల అరెస్టు

యడ్లపాడు, సెప్టెంబరు 4: యడ్లపాడు మండలం కారుచోలలో పేకాడుతున్న తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఓ రేకుల షెడ్డులో కోతముక్క ఆడుతున్నారన్న సమాచారం అందడంతో దాడులు నిర్వహించామన్నారు. దాడులలో కోతముక్క ఆడుతున్న తొమ్మిదిమందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.7,260లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అందరినీ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

రెండు వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

నాదెండ్ల, సెప్టెంబరు 4: మండలంలోని జాతీయ రహదారిపై జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు గాయపడిన సంఘటన బుధవారం జరిగింది. గణపవరం గ్రామానికి చెందిన వలివర్తి వెంకటరామరాజుతో పాటు శివ నాగేశ్వరరావులు చిలకలూరిపేట నుంచి గ్రామానికి వస్తుండగా జాతీయ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణ కోసం అడ్డంగా పెట్టిన రమ్ము తగలటంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడింది. ఈ ఘటనలో వెంకటరామరాజు తీవ్రంగా గాయపడగా మెరుగైన చికిత్సకోసం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతనితో పాటు వాహనంపై ఉన్న శివనాగేశ్వరరావు స్వల్పంగా గాయపడ్డాడు. కాగా గణపవరం 4వ గ్రామ సచివాలయంలో కార్యదర్శిగా పనిచేస్తున్న జ్యోతిర్మయి గుంటూరులో నివాసం ఉంటుంది. ప్రతిరోజు ఆమె ద్విచక్ర వాహనంపై వచ్చి విధులకు హాజరవుతుంటుంది. పాఠశాలకు సెలవు కావటంతో తన కుమారుడిని ఎక్కించుకొని గణపవరం వస్తుండగా తిమ్మాపురం సమీపంలో వాహనం అదుపుతప్పి తల్లి, కుమారుడు ఇద్దరు గాయపడ్డారు. చికిత్సకోసం వారిని చిలకలూరిపేట పట్టణంలోని ఒక ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.

సెయింట్ చార్లెస్ స్కూలుకు రు.30 వేల విరాళం

చిలకలూరిపేట, సెప్టెంబర్ 4: పట్టణంలోని సెయింట్ చార్లెస్ స్కూల్ పూర్వ విద్యార్థి డాక్టర్ కందిమళ్ళ హిమబిందు మంగళవారం ఆస్కూలు అభివృద్ధి కోసం రూ.30వేలు విరాళం ప్రకటించారు. ఈ విరాళాన్ని స్కూలు కరస్పాండెంట్ సిస్టర్ సుందరి, సిస్టర్ పుష్పలకు ఆమె స్థానిక కేజే ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో అందచేశారు. కార్యక్రమంలో ఒయాసిస్ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ళ జయమ్మ, డాక్టర్ త్రిష నైనిక, శ్రియనయిత, గట్టు సరోజిని, కరణం విజయ, కోలా విజయలక్ష్మి, డాక్టర్ ప్రపుల్ల, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.